ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 6 మార్చి 2025

అనర్హులకే ఇళ్ల పట్టాలు...!

- ఐదేళ్ల అక్రమాలు వెలుగులోకి..
- నకిలీ పట్టాలతో మోసపోయిన ప్రజలు
- విచారణ చేస్తే రూ.కోట్ల విలువైన స్థలాలకు విముక్తి

అనర్హులకు ఇళ్ల పట్టాల మంజూరుతో పాటు, నకిలీ పట్టాలు సృష్టించి ప్రభుత్వ స్థలాలను అమాయకులకు విక్రయించిన ఉదంతాలు ఒక్కటొక్కటే వెలుగులోకి వస్తున్నాయి. కమ్యూనిటీ అవసరాలకు వదిలిన స్థలాలను సైతం విక్రయించారు. ఇటీవల రెవెన్యూ అధికారులు నేలమట్టం చేసిన అక్రమ కట్టడం ఆ స్థలంలోనిదే. ఈ చర్యతో సర్వేనెంబర్ 779/2లోని 9.96 ఎకరాల్లో వేసిన లేఅవుట్ లోని ప్లాట్లను ఎక్కువగా అనర్హులకే కేటాయించినట్లు తేలింది. దీంతో పాటు 40 వరకు నకిలీ పట్టాలు సృష్టించి విక్రయించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



మదనపల్లె టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నవరత్నాల పథకం కింద మదనపల్లె మండలం సీటీఎం క్రాస్ రోడ్డు పంచాయతీలోని సర్వేనెంబరు-779/2లో 9.96 ఎకరాల్లో పేదలకు ఇళ్ల స్థలాల కోసం లేఅవుట్ వేశారు. ఈ లేఅవుట్‌లో ప్రజాప్రయోజనాల కోసం 9 కుంటలు రోడ్లు, గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రానికి స్థలాలు కేటాయించి, మిగిలిన స్థలంలో 207 ఇళ్ల స్థలాలకు లేఅవుట్ వేశారు. నవరత్నాల కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఒకటిన్నర సెంటు చొప్పున పట్టాలు పంపిణీ చేశారు. అయితే ఈ పట్టాలు పొందిన వారంతా ధనికులు, భూస్వాములు, ప్రభుత్వ ఉద్యోగుల బినామీలేనని తెలిసింది. వీటితో పాటు అప్పట్లో పనిచేసిన ఒక వీఆర్‌వో, తహసీల్దార్ సంతకాలతో, తహసీల్దార్ కార్యాలయం సీలుతో నకిలీ పట్టాలు సైతం సృష్టించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. అమాయకులైన కొంత మందికి ఈ నకిలీ పట్టాలు విక్రయించి మోసం చేసినట్లు తెలిసింది.



పేదల కోసం వేసిన లేఅవుట్‌లో నిర్మించిన ఇళ్లు

కమ్యూనిటీ స్థలంలో కమర్షియల్ భవనాలు

ఈ లేఅవుట్‌లో ప్రజాప్రయోజనాల కోసం కేటాయించిన స్థలం సీటీఎం-అంగళ్లు రోడ్డు పక్కనే ఉండటంతో కొందరు ఈ స్థలంలో ఇంటి పట్టాలు మంజూరు చేయించుకున్నారు. ఈ స్థలాల్లో షాపింగ్ గదులు నిర్మించి అద్దెలకు ఇచ్చారు. చలపతి అనే వ్యక్తి ఈ స్థలంలోనే షాపింగ్ గది నిర్మించి ఇతరులకు విక్రయించాడు. ఇటీవల జరిగిన విచారణలో అక్రమాలు నిర్ధారణ కావడంతో ఈ అక్రమ నిర్మాణాన్ని రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. మిగిలిన భవనాల విషయమై గత శుక్రవారం రెవెన్యూ అధికారులు మదనపల్లెకు వచ్చిన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా ప్రజాప్రయోజనాలకోసం కేటాయించిన స్థలాల్లో కమర్షియల్ భవనాలు ఎలా నిర్మిస్తారని, వీటిపై విచారణ చేసి వెంటనే అక్రమ నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు.

విచారణ చేస్తే రూ.కోట్ల విలువైన స్థలం వెలుగులోకి

సర్వేనెంబరు-779/2 లో వేసిన లేఅవుట్ సీటీఎం-అంగళ్లు రోడ్డు పక్కనే ఉండటంతో ఇక్కడ కుంట స్థలం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు పలుకుతోంది. ఈ సర్వే నెంబరులో 207 ఇంటి స్థలాలకు గాను 167 మందికి ఇంటి పట్టాలు మంజూరు చేయగా, అందులో 132 మందికి హౌసింగ్ స్కీమ్ కింద ఆర్థిక సాయం అందుతోంది. వీటిలో పునాదుల స్థాయిలో 72, గోడల స్థాయిలో 9, పైకప్పు స్థాయిలో 1 ఇల్లు ఉండగా, 49 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇవి పోను మిగిలిన స్థలాలు ఎవరి ఆధీనంలో ఉన్నాయన్న విషయమై రెవెన్యూ అధికారులు విచారణ చేయాల్సి వుంది.



సీటీఎం-2 గ్రామంలో అంగళ్లు రోడ్డు పక్కన నిర్మించిన షాపింగ్ గదులు

ప్రతి స్థలంపై విచారణ చేస్తాం..



సీటీఎం-2 రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబరు-779/2లో వేసిన లేఅవుట్‌లో కొన్ని స్థలాలను అనర్హులకు కేటాయించినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. దీనిపై ప్రతి ప్లాట్ వద్దకు వెళ్లి ఎవరి ఆధీనంలో ఉంది, వారి అర్హతపై విచారణ చేస్తాం. నకిలీ పట్టాల విషయమై క్షుణ్ణంగా పరిశీలిస్తాం, అనర్హులని తేలితే పట్టా రద్దు చేసి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అర్హులకు కేటాయిస్తాం.

- ధనంజయులు, తహసీల్దార్, మదనపల్లె

కూలి డబ్బు అద్దెలకే సరిపోతోంది



మేము ఇద్దరం నర్సరీలో కూలి పనులకు వెళుతున్నాం. వారిచ్చే డబ్బు ఇంటి అద్దెకు, కరెంటు చార్జీలకు, తాగునీళ్లకే సరిపోతోంది. 20 ఏళ్ల నుంచి బాడుగ ఇంట్లోనే కాపురమున్నాం. ఎన్నిసార్లు అర్జీలు ఇచ్చినా మాకు ఇంటి పట్టా ఇవ్వలేదు. ఈ ప్రభుత్వమైనా మాలాంటి పేదోళ్లకు ఇంటి స్థలాలు ఇవ్వాలి.

- కళావతి, మిట్టపల్లె, సీటీఎం-2 రెవెన్యూ గ్రామం

ఐదేళ్లుగా అర్జీలు ఇస్తూనే ఉన్నాం



నిరుపేదలైన మేము ఇంటి స్థలం కోసం ఐదేళ్లుగా అర్జీలు ఇస్తూనే ఉన్నాం. కొన్నిసార్లు ఈ అర్జీలను తీసుకున్న నాయకులు మేము టీడీపీ మద్దతుదారులమంటూ అర్జీలను చించి పడేశారు. చాలీచాలని సంపాదన కారణంగా ఇంటి అద్దె చెల్లించలేక పోతున్నాం.

- సి.పద్మ, సీటీఎం-2 గ్రామం

సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే
తాటతీస్తాం

- ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే జిల్లా బహిష్కరణ : ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో మంగళవారం సాయంత్రం జరిగిన వీరభద్రస్వామి పార్వేట ఉత్సవంలో రెండు వర్గాల వారు ఒకరినొకరు రెచ్చగొట్టుకునే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదని, సంఘవిద్రోహ చర్యలకు ఎవరు పాల్పడినా తాటతీస్తామని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు హెచ్చరించారు. ఉత్సవం సందర్భంగా చోటు చేసుకున్న ఉద్రిక్త పరిస్థితులు సద్దుమణిగిన అనంతరం మంగళవారం అర్ధరాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. మతాలను అడ్డం పెట్టుకుని సంఘ విద్రోహ శక్తులుగా చలామణి అవుతామంటే చూస్తూ ఊరుకోమని, ఎంతటి వారైనా గొడవలకు పాల్పడితే విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. వీరభద్రస్వామి పార్వేట సందర్భంగా ఓ వర్గం వారు అనవసర వ్యాఖ్యలు చేయడంతో మరో వర్గం వారు జంక్షన్ వద్దకు చేరుకుని ఊరేగింపును అడ్డుకోవడంతో పాటు పోలీసులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసి పోలీసులపై దౌర్జన్యానికి దిగి చెప్పులు విసరడం, రాళ్లు రువ్వడం చేశారన్నారు. విధిలేని పరిస్థితుల్లో ఒక దశలో పరిస్థితిని అదుపు చేయడానికి చేసిన లాఠీచార్జీలో పోలీసులతో సహా చాలా మందికి గాయాలయ్యాయన్నారు. సంఘటన జరిగిన సమయంలో డ్రోన్ కెమెరాలతో ఆకతాయిలను గుర్తించామన్నారు. ఉద్రిక్త పరిస్థితులకు కారణమైన పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ఎవరు నడుచుకున్నా అటువంటి వారిపై పీడీ యాక్ట్‌లు నమోదు చేయడంతో జిల్లా బహిష్కరణ చేస్తామని ఎస్పీ హెచ్చరించారు.

మతసామరస్యానికి ప్రతీక రాయచోటి

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి, ప్రశాంతతకు ప్రతీక రాయచోటి అని, మత విద్వేషాలకు అతీతంగా సామరస్యం, సోదరభావంతో ప్రతి ఒక్కరూ మెలగాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ప్రజలకు పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణంలో మంగళవారం జరిగిన ఘటన బాధాకరమని, కొంతమంది ఆకతాయిలు రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించడమే కాకుండా ఇతరులకు అసౌకర్యం కలిగించడం బాధాకరమన్నారు. శాంతియుతంగా కార్యక్రమాలు జరుపుకోవాలే తప్ప రెచ్చగొట్టే విధానాలతో ఇతరులను ఇబ్బంది పెట్టడం మంచిది కాదన్నారు. సమన్వయంతో సామరస్యంగా సమస్యను పరిష్కరించాలని పోలీసులను ఆదేశించామన్నారు. ప్రస్తుతం రాయచోటి పట్టణంలో ప్రశాంత వాతావరణం ఉందని, ఈ పరిస్థితిని చెడగొట్టడానికి కొంతమంది పుకార్లను వ్యాప్తి చేయడానికి ప్రయత్నం చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కవ్వింపు చర్యలకు పాల్పడిన వారిపై పోలీసులు ప్రత్యేకమైన నిఘా పెట్టి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారన్నారు. ప్రజలందరూ సంయమనంతో మెలగాలని, ఎలాంటి అపోహలను, పుకార్లను నమ్మవద్దని ఆయన సూచించారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్
పెన్షన్‌లో 50 శాతం కోత
- భూసేకరణలో అక్రమాల పర్యవసానం 6

కాసుల వేటలో..
అనంత లోకాలకు..
- జన్మభూమిలో జీవనం భారమై గల్ఫ్‌కు ... 6

నీలగిరి చెట్లు @ రూ.27.10 లక్షలు

- రికార్డు స్థాయిలో పంచాయతీ ఆదాయం



నీలగిరి చెట్ల వేలం నిర్వహిస్తున్న డీఎల్‌పీవో నాగరాజు, తదితరులు

నిమ్మనపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తవళం పంచాయతీకి బుధవారం జరిగిన నీలగిరి చెట్ల వేలం ద్వారా రికార్డు స్థాయిలో రూ.27.10 లక్షల ఆదాయం చేకూరినట్లు డీఎల్‌పీవో నాగరాజు తెలిపారు. బుధవారం తవళం పంచాయతీ కోమిటివానిచెరువులో ఉన్న నీలగిరి చెట్లకు వేలం నిర్వహించారు. వ్యాపారులు అధిక సంఖ్యలో వేలంలో పాల్గొన్నారు. రూ.2 లక్షలు డిపాజిట్ చేయాల్సి ఉండగా 24 మంది డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. గతంలో ఐదేళ్లకు ముందు కేవలం రూ.6 లక్షలు మాత్రమే పలికిన నీలగిరి చెట్లు ఈసారి రికార్డు స్థాయి పలికి పంచాయతీకి భారీ ఆదాయం చేకూరినట్లు తెలిపారు. భాకరాపేట మండలం ఎర్రావారిపాలెం వాసి సయ్యద్ బాషా వేలంలో అత్యధికంగా రూ.27.10 లక్షలకు పాడి దక్కించుకున్నారు. వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వినియోగిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అటవీ శాఖాధికారి మదన్‌మోహన్, ఎంపీడీవో పరమేశ్వర్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ చలపతిరావు, ఏవో రమేష్, సర్పంచ్ రెడెప్ప, కార్యదర్శి మారెప్ప, నాయకులు రాజన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అరచేతిలో హాల్ టికెట్

- ప్రభుత్వ వాట్సాప్‌లో సిద్ధం
- ఎక్కడి నుంచైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు



వాట్సాప్ హాల్ టికెట్

కలికిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చెబుతున్న వాట్సాప్ గవర్నెన్స్‌లో సేవలన్నీ ఒక్కొక్కటిగా ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఇందులో వివిధ రకాల సేవలు అందుబాటులో ఉండగా తాజాగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఇందులోనే పొందుపరిచారు. విద్యార్థి వివరాలను నమోదు చేస్తే వెంటనే ఆ విద్యార్థి హాల్‌టికెట్ డౌన్‌లోడ్ అవుతోంది. ఇలా డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్‌ను సంబంధిత హెడ్మాస్టరు ధృవీకరించి (అటెస్ట్) సంతకం చేయాల్సిన పని లేదు. హాల్‌టికెట్‌పైనే క్యూఆర్ కోడ్ ముద్రించారు. దీనిని పరీక్ష హాల్లో స్కాన్ చేస్తే విద్యార్థికి సంబంధించిన వివరాలన్నీ వెల్లడవుతాయి. దీంతో ఈ హాల్ టికెట్‌ను ట్యాంపర్ చేసే అవకాశం ఏమాత్రం లేదు. ఇప్పటి వరకూ వాట్సాప్‌లో ఈ రకం ప్రభుత్వ సేవలను పొందనివారు తాజాగా 95523 00009 నెంబరును మన మిత్ర ఏపీ ప్రభుత్వ వాట్సాప్ సర్వీసుల పేరుతో సేవ్ చేసుకుంటే చాలు. తరువాత వాట్సాప్‌లో మన మిత్ర అని టైప్ చేస్తే వాల్ ప్రత్యక్షమవుతుంది. అక్కడ హాయ్ అని టైప్ చేస్తే ఏ సేవలు కావాలో ఎంచుకోండని అడుగుతుంది. ఇందులో విద్యను ఎంపిక చేస్తే ఇంటర్, టెన్త్ హాల్ టికెట్ల విభాగాలు కనిపిస్తాయి. ఇందులో ఎస్ఎస్‌సీ హాల్ టికెట్‌ను సెలెక్ట్ చేస్తే అప్లికేషన్ నెంబరుగానీ లేదా చిల్డ్రన్ ఐడీగానీ నమోదు చేసి తరువాత విద్యార్థి పుట్టిన తేదీని పేర్కొని, రెగ్యులర్ లేక ప్రైవేట్ ఆప్షన్లను ఎంచుకుంటే వెంటనే హాల్‌టికెట్ పీడీఎఫ్ ప్రత్యక్షమవుతుంది. దీనిని డౌన్‌లోడ్ చేసుకుంటే సరిపోతుంది. ఈ ప్రక్రియ అంతా కూడా ఒక నిమిషంలోనే జరిగిపోతుంది. ఇందులోనే క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. ఇందులోనే సబ్జెక్టుల వారీ పరీక్షలు జరిగే తేదీలు, సమయాలు స్పష్టంగా ఉంటాయి. పరీక్షా కేంద్రం, విద్యార్థి పుట్టుమచ్చల వివరాలు కూడా ఉంటాయి.

ప్రభుత్వ భూమిపై 'ఖద్దరు' కన్ను!

- ప్రధాన రహదారికి పక్కనే స్థలం
- వైసీపీ హయాంలోనే ప్రయత్నం
- కూటమి ప్రభుత్వంలో రంగం సిద్ధం



ప్రధాన రహదారికి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి ఇదే

రైల్వే కోడూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రహదారికి పక్కనే ఉన్న రూ.40 కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిపై కొందరు ఖద్దరు బాబులు కన్నేసి కాజేసే ప్రయత్నం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో కొందరు నాయకులు ప్రయత్నించి విఫలమయ్యారు. మళ్లీ ప్రస్తుత ప్రభుత్వంలో కొందరు నాయకులు ఈ భూమిని కాజేసే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే.... రైల్వేకోడూరు మండలం మైసూరివారిపల్లె పంచాయతీలోని మార్కెట్ యార్డు పక్కన సర్వే నెంబరు 2042లో ప్రభుత్వ భూములు ఉన్నాయి. ఇందులోని కొన్ని స్థలాలను పక్కాగా విక్రయించేశారు. ప్రధాన దారికి పక్కనే (మఱ్రిమాను) ఉన్న 1.90 ఎకరాల భూమిలో వైసీపీ హయాంలో గ్రామ సచివాలయం నిర్మించారు. అయితే ఈ స్థలంలో సచివాలయం ఎందుకు నిర్మించారని అప్పట్లో జిల్లా అధికారులు స్థానిక అధికారులను ప్రశ్నించారు. రాజకీయ అండదండలున్న వారు సర్దిచెప్పడంతో ఈ వ్యవహారం సద్దుమణిగినా, ఈ స్థలాన్ని కన్వర్షన్ చేయడానికి కోర్టు నుంచి ఆర్డర్ తెచ్చుకున్నారు. కోర్టులో అప్పటి తహసీల్దార్ అన్ని పత్రాలను సమర్పించడంతో వారి ప్రయత్నం ఆగిపోయింది. ప్రస్తుతం మళ్లీ ఈ భూమిని కాజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రధాన దారికి పక్కనే ఉండడం, సుమారు రూ.40 కోట్ల విలువ ఉండడంతో కొందరు ఖద్దరు బాబుల కన్నుపడింది. ఈ సర్వే నెంబరులో కొంత భాగం పీవోటీలో ఉంది. ఈ భూమిని ఇప్పిస్తామని వైసీపీ ప్రభుత్వంలో కొందరు నాయకులు సుమారు 25 మంది దగ్గర రూ.1.20 కోట్లు వసూలు చేసినట్లు తెలిసింది. పని పూర్తి కాకపోయినా తీసుకున్న డబ్బు ఇప్పటి వరకు తిరిగి ఇవ్వలేదని తెలిసింది. ఈ భూమి విషయంగా కొందరు నాయకులు విజయవాడలో కొన్ని రోజుల పాటు మకాం వేసినట్లు తెలిసింది. అధికారులను ఎలాగైనా లోబరచుకుని ఈ భూమిని కాజేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ప్రభుత్వ భూములను కాపాడడానికి నాయకులు ప్రయత్నించాలి గాని కాజేస్తే ఎలా అని ప్రజలు అంటున్నారు.

పరిశీలిస్తాం..

మైసూరివారిపల్లె పరిధిలో ఉన్న భూమిని పరిశీలిస్తాం. గతంలో ఏం జరిగిందో మాకు తెలియదు. ప్రస్తుతం ప్రభుత్వ భూముల జోలికి వస్తే చర్యలు తప్పవు. ప్రభుత్వ భూములను కాపాడే బాధ్యత మాపై ఉంది. ప్రజలు కూడా ఇందుకు సహకరించాలి.

- మహబూబ్‌చాంద్, తహసీల్దార్, రైల్వేకోడూరు

వర్సిటీగా కలికిరి జేఎన్టీయూ!

- శాసనసభలో కోరిన ఎమ్మెల్యే నల్లారి
- మంత్రి నారా లోకేశ్ సానుకూలత





మాట్లాడుతున్న కిశోర్‌కుమార్ రెడ్డి

కలికిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజీలోనే జేఎన్టీయూ యూనివర్సిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. బుధవారం శాసనసభలో జరిగిన ప్రశ్నోత్తరాల్లో పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో అన్నమయ్య జిల్లాలో తప్ప అన్ని జిల్లాల్లోనూ యూనివర్సిటీలున్నాయని వివరించారు. కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు, వసతులు అందుబాటులో ఉన్నాయని, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాలతో కలిపి కలికిరిలో జేఎన్టీయూ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో తాను పాదయాత్ర చేస్తున్న సందర్భంగా కలికిరి జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలను కిశోర్‌కుమార్‌రెడ్డి చూపి దాని ప్రాధాన్యతను వివరించారని, తనకు కూడా దానిపైన అవగాహన ఉందని తెలిపారు. జిల్లాకు ఒక యూనివర్సిటీని ఏర్పాటు చేయాలనేది తమ ఆలోచనగా కూడా ఉందని, త్వరలోనే వర్సిటీని కలికిరిలో ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి లోకేశ్ తెలిపారు.

రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (గురువారం సాయంత్రం)	సెహరీ (శుక్రవారం ఉదయం)
రాయచోటి	6.28	5.09
మదనపల్లె	6.30	5.13
రాజంపేట	6.26	5.15
పీలేరు	6.28	5.06

గల్ఫ్‌లో ఎంత పెట్రోలు ఉందో.. అన్ని కన్నీళ్లూ ఉంటాయేమో? తమ కుటుంబాల్లో సంతోషం నింపడం కోసం.. అక్కడి ఎడారుల్లో నానా కష్టాలు అనుభవించేవాళ్లు ఎందరో.. ఉపాధి దొరకక.. దొరికినా నిబంధనలు అతిక్రమించి పనిచేయాల్సి రావడంతో శిక్షలు, ప్రమాదాలు, అనారోగ్యం బారిన పడి అసువులు కోల్పోతున్నారు. చివరికి ఆ మృతదేహం స్వదేశానికి తీసుకుని వచ్చేందుకు వారి కుటుంబ సభ్యులు పలు సమస్యలు ఎదుర్కోవడంతోపాటు భారీగా డబ్బు కూడా ఖర్చు చేయాల్సి వస్తోంది. జిల్లా నుంచి అరబ్ దేశాలకు వలస వెళుతున్న వారిలో పలువురి జీవితాలు దాదాపుగా ఇలాగే ఉంటున్నాయి.



కాసుల వేటలో.. అనంత లోకాలకు..

- జన్మభూమిలో జీవనం భారమై గల్ఫ్‌కు ..
- ఎడారుల్లో ఆవిరవుతున్న బతుకులు..
- నెలలు గడిచినా తిరిగిరాని మృతదేహాలు
- ప్రభుత్వం వైపు బాధిత కుటుంబాల చూపు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం కలిసి రాక, సొంత ఊళ్లో పనులు లేక.. పిల్లల చదువు , కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చుకునేందుకు ఉమ్మడి కడప జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు కన్న తల్లినీ, పుట్టిన ఊరినీ వదిలి , పొట్ట చేతబట్టుకుని ఎడారి దేశాల బాట పడుతున్నారు. అక్కడ సరైన పని దొరకక, తిరిగి ఇంటికి రాలేక ఇబ్బందులు పడుతున్నారు. ఓ సారి కువైత్‌కు వెళ్లి వస్తే లైఫ్ సెటిలవుతుందని, నాలుగు రాళ్లు వెనకేసుకోవచ్చన్న ఉద్దేశంతో ఉమ్మడి కడప జిల్లాలోని కడప, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలకు చెందిన వేలాది మంది ప్రతి ఏటా కువైత్‌కు వెళుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే..

ఇంట్లో పనికి ఖాదీమ్ వీసా, బయట పనికి సూన్ వీసా అవసరం. కొత్తగా కువైత్‌కు వెళ్లే వారిలో అధిక శాతం డ్రైవర్లుగా, వంట మనుషులుగా ఉపాధి పొందుతుంటారు. మరి కొంతమంది ఇంట్లో వీసా తీసుకుని బయటి పనులు చేస్తుంటారు. ఖాదీమ్ వీసాపై వెళ్లాలంటే రెండు నుంచి మూడు లక్షల రూపాయలు, సూన్ వీసాపై వెళ్లాలంటే మూడు నుంచి ఐదు లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుంది. అంత డబ్బు భరించలేని వారు ఖాదీమ్ వీసాలో కువైత్‌కు వెళ్లి, అక్రమంగా బయటి పనులు చేస్తుంటారు. ఇలాంటి వారు పట్టుబడితే అక్కడి ప్రభుత్వం కఠినంగా శిక్షించడంతోపాటు, మన దేశానికి పంపించేస్తుంది. శిక్షలకు గురైనవారు, ఉపాధి లభించని వారు చివరికి ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. చనిపోయిన వారి బంధువులెవరైనా అక్కడ ఉంటే.. చకచకా పనులు చేసి మృతదేహాలను స్వదేశానికి పంపిస్తున్నారు. ఎవరూ లేని వారి పరిస్థితి వర్ణనాతీతం.. స్వచ్ఛంద సంస్థలు, దాతలెవరైనా సహకరిస్తే కొన్ని నెలల తర్వాతైనా ఇలాంటి వారి మృతదేహాలు స్వదేశానికి వస్తాయి. ఇటీవల రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి, చిట్వేల్ మండలాలకు చెందిన పలువురు ఇలా మృతి చెందారు.

ఏపీఎన్ఆర్‌టీ సేవలు

కువైత్‌లో మృతి చెందిన తెలుగువారి మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెన్స్ తెలుగు సొసైటీ కృషి చేస్తోంది. 2017లో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ సొసైటీని ఏర్పాటు చేశారు. బాధితులకు 50 వేల రూపాయలు మంజూరు చేయడంతో పాటు, మృతదేహాలను వారి స్వగ్రామానికి తరలించేందుకు విమానాశ్రయం నుంచి అంబులెన్స్ సదుపాయం కల్పించారు. గల్ఫ్‌లో భారత రాయబార కార్యాలయంతో అనుసంధానమై సేవలు అందిస్తున్న తెలుగు సోషల్ వలంటీర్స్ మృతదేహాలను తరలించేందుకు అవసరమైన అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కాగా, ప్రమాదంలో మృతి చెందిన వారికి వీసా 18 ఉంటే నామినీకి కంపెనీ ఇన్సూరెన్స్ మొత్తం చెల్లిస్తుంది. గల్ఫ్‌కు వెళ్లే చాలా మందికి ఇన్సూరెన్స్‌పై అవగాహన లేకపోవడంతో ఏటేటా ఎంతోమంది అక్కడికి వెళ్లి మోసపోతున్నారు.


ఇటీవల గల్ఫ్‌లో మృతి చెందిన కొప్పుల రవికుమార్ మృతదేహం

ప్రభుత్వం ఆదుకుంటుంది



వివిధ కారణాలతో గల్ఫ్‌లో మృతి చెందినవారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది. గల్ఫ్‌కు వెళ్తున్న కార్మికులకు వారి దేశంలో వీసాతోపాటు ఇన్సూరెన్స్ కల్పిస్తారు. కానీ ప్రమాదాలు జరిగినప్పుడు ఆ డబ్బు ఏమవుతోందో ఎవరికీ అర్థం కావడం లేదు. అక్కడి చట్టాలపై అవగాహన లేకపోవడంతో, చాలా కుటుంబాలు తమకు రావల సిన ఇన్సూరెన్స్ పొందలేక పోతున్నారు. ఇలాంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం ద్వారా అవగాహన కల్పిస్తోంది. గల్ఫ్‌లో మృతిచెందిన కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల పరిహారం చెల్లించనున్నట్లు ఇటీవల తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలను జారీచేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గల్ఫ్ బాధితుల కోసం ఏర్పాటు చేసిన ఏపీఎన్ఆర్టీ సొసైటీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నాం. గల్ఫ్‌లో ఇబ్బందులు పడుతున్న వారు తమ సమస్యలను మా దృష్టికి తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటాం. చంద్రబాబు పాలనలో ఏ ఒక్కరికి అన్యాయం జరగదు.

- పంతగాని నరసింహ ప్రసాద్,
టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి కోరారు. జేసీ ఆదర్శరాజేంద్రన్, జిల్లా అధికారులతో కలసి పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 8న శ్రీనివాస డిగ్రీ కళాశాలలో నిర్వహించే మెగా జాబ్‌మేళాకు 25 మల్టీ నేషనల్ కంపెనీల ప్రతినిధులు వస్తున్నారని, 1500మందికి ఉద్యోగావకాశాలు కల్పించవచ్చన్నారు. టెన్త్ నుంచి పీజీ వరకు చదివిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. వివరాలకు 9553202509, 9618971075 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయులు పనితీరు మెరుగుపరుచుకోవాలి

గుర్రంకొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): విద్యా బోధన తీరు సరిగాలేదంటూ జిల్లా విద్యా శాఖ అధికారి సుబ్రమణ్యం ఉపాధ్యాయులపై మండిపడ్డారు. బుధవారం ఆయన గుర్రంకొండ తెలుగు జడ్పీ హైస్కూల్, ఉర్దూ హైస్కూల్, కండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కండ్రిగ పాఠశాలలోని విద్యార్థులను మ్యాథ్స్, సైన్స్ అంశాలపై ప్రశ్నలు అడిగారు. సరిగా సమాధానం చెప్పకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పనితీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. మధ్యాహ్నభోజనం తినే వారి పేర్లు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఎఫ్ఏ-4 పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేంద్రబాబు, హెచ్ఎం కమ్మర్‌తాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

ఫారంపాండ్స్‌తో కూలీలకు పని కల్పించండి

ములకలచెరువు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డుదారులందరికీ కచ్చితంగా ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశించారు. సీఎల్ఆర్‌సీ భవనంలో బుధవారం నియోజవర్గంలోని ఆరు మండలాల ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామ పంచాయతీలో 25కు పైగా ఫారంపాండ్స్, సేద్యపు కుంటలు తవ్వించాలన్నారు. ఈ పనులను త్వరగా పూర్తి చేస్తే రైతులకు ఎంతో ప్రయోజకంగా ఉంటుందని, పశువులకు, పక్షులకు తాగడానికి నీరుంటుదన్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచకుంటే చర్యలు తప్పవన్నారు. రోజువారీ కూలి రూ.300 తగ్గకుండా పనులు చేయించడంతోపాటు, ప్రతి కూలీకి 100 రోజులు పనుల కల్పనకు కృషి చేయాలన్నారు. అనంతరం మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. సమావేశంలో డ్వామా ఏపీడీ మధుబాబు, ఎంపీడీఓ హరినారాయణ, ఆరు మండలాల పీఓలు, ఉపాధి ఇంజనీర్లు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.


సూచనలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

'నాటుసారా రహిత గ్రామంగా తీర్చిదిద్దుతాం'

సంబేపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరకలబండ బిడికిని సారా రహిత గ్రామంగా తీర్చి దిద్దుతామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. బుధవారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. నాటుసారాతో కలిగే నష్టాలు ఆర్థిక ఇబ్బందులను ప్రజలకు వివరించారు. నాటుసారా తయారీ ఒకటే జీవనోపాధి మార్గం కాదని సం పాదనకు ఎన్నో మంచి మార్గాలు ఉన్నాయని తెలియ జేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ హిమబిందు, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎస్ఐ భక్తవత్సలం, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కుళాయప్ప, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

గుర్రంకొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుర్రంకొండ పంచాయతీ తల్లారివాండ్లపల్లెకు చెందిన వి.శ్రీనివాసులు(48) గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. రుణం చెల్లించాలని రుణదాతల నుంచి ఒత్తిడి రావడంతో మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం మజ్జిగవారిపల్లె వద్ద పొలంలో చింతచెట్టుకు ఉరేసుకుని మృతి చెంది ఉండడాన్ని అక్కడి రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఏఎస్ఐ నరసింహులు తెలిపారు.

చిన్నారిపై పిచ్చికుక్క దాడి

ములకలచెరువు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిపై ఓ పిచ్చికుక్క దా డి చేసింది. ఎక్కడ పడితే అక్కడ కరవడంతో పరిస్థితి ఆందోళనకరం గా మారింది. గ్రామస్తుల కథనం మేరకు...ములకలచెరువు మండలం మద్దినాయనిపల్లె పంచాయతీ బిస్సయ్యగారిపల్లెకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి ఐదేళ్ల కుమార్తె వేదశ్రీ బుధవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడి చేసింది. చిన్నారి కేకలు వేయడంతో కుటుంబీకులు రక్షించి చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కళ్లపై కరవడంతో కుడి కన్ను వాచింది. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతి రూయాకు తరలించారు.


గాయపడ్డ చిన్నారి వేదశ్రీ

టిప్పర్ ఢీకొని యువకుడి దుర్మరణం

మదనపల్లె అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు మదనపల్లె పట్టణం, రెడ్డీస్ కాలనీకి చెందిన దద్దాల శశికుమార్ నాయుడు (28) బైక్‌పై పుంగనూరు నుంచి వస్తుండగా బసినికొండ పంచాయతీ బైపాస్ జంక్షన్ వద్ద టిప్పర్ ఢీకొంది. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు తాలూకా పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న ఇతని స్వగ్రామం గుర్రంకొండ మండలం, చెర్లోపల్లె పంచాయతీ కమ్మగోవిందపల్లె కాగా, మదనపల్లెలో స్థిరపడ్డారు. ఒక్కగా నొక్క కొడుకును తీసుకుపోయావా దేవుడా అంటూ తండ్రి రాజన్న విలపించాడు.


యువకుడి మృతదేహం

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు


నిందితులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

గుర్రంకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు. ఆయన తెలి పిన వివరాల మేరకు గు ర్రంకొండ పట్టణానికి చెం దిన ఆదిల్(21), కమాల్‌ఖాన్(26), రెడ్డికుమార్(20)లు గంజాయికి బానిసలు కావడంతోపాటు దానిని విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు నిందితులపై రెక్కీ నిర్వహించారు. గుర్రంకొండ మార్కెట్ యార్డు వద్ద బుధవారం వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, ఒక కిలో గంజాయి పట్టుబడింది. దీంతోపాటు రెండు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరుపరిచనట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ మధురామచంద్రుడు సిబ్బంది పాల్గొన్నారు.

పార్వేట ఉత్సవం ఘటనపై ఇరువర్గాలతో చర్చించాం

● మీడియాతో కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటిటౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పార్వేట ఉత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం పట్టణంలోని ఠాణా జంక్షన్ వద్ద చోటు చేసుకున్న సంఘటనపై ఇరువర్గాలతో చర్చించామని, గతంలో మాదిరి సఖ్యతగా నడుచుకుంటామని ఒప్పుకునట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. పార్వేట ఉత్సవం సందర్భంగా ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా బుధవారం రాత్రి పట్టణంలోని స్టేట్ గెస్టుహౌస్‌లో కలెక్టర్, ఎస్పీ, మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ముస్లిం పెద్దలు, హిందూ సంఘాల పెద్దలతో విడివిడిగా చర్చలు జరిపారు. సుమారు రెండు గంటల చర్చల అనంతరం ఇరువర్గాలవారు అటు ముస్లిం సంప్రదాయాలను, ఇటు హిందూ సంప్రదాయాలను గౌరవిస్తామని, ఎవరి ఊరేగింపులు జరిగినా సమస్యలు సృష్టించమని అంగీకరించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో జరగబోయే కార్యక్రమాల విషయంలో కలెక్టర్, ఎస్పీ, తహసీల్దార్‌తో పాటు ఇరువరాలకు చెందిన శాంతికమిటీ సభ్యులతో కలిసి చేపట్టబోయే కార్యక్రమాల రూటు మ్యాప్ నిర్ణయించి రాయచోటి పట్టణంలో ప్రశాంతత నెలకొనేందుకు కృషి చేస్తామన్నారు. అనవసర సమస్యలు సృష్టించకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇరువర్గాలపై ఉందని సూచించారు. ఈ సంఘటనకు సంబంధించిన ఒకవర్గం నుంచి 11మందిని, మరో వర్గం నుంచి 13మందిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపెట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో సున్నితమైన సమస్యలపై గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.


మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పెన్షన్‌లో 50 శాతం కోత

- భూసేకరణలో అక్రమాల పర్యవసానం
- దుర్వినియోగమైన రూ.14.50 లక్షలు రికవరీ
- 18 ఏళ్లుగా పెండింగులో వున్న కేసు పరిష్కారం

కలికిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పెండింగులో వున్న కేసులను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది. కడప జిల్లాలో వైఎస్సార్ హయాం నుంచి జరిగిన అవినీతి కేసులను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రాధాన్యమి స్తోంది. తాజాగా ఉమ్మడి కడప జిల్లాలోని పొత్తపి గ్రామంలో భూసేకరణ సందర్భంగా జరిగిన అక్రమా లకు అప్పటి భూసేకరణ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.సాయినాథ్‌ను (ప్రస్తుతం రిటైరయ్యారు) బాధ్యుడుగా తేల్చి, ఆయన పెన్షన్‌లో 50 శాతం శాశ్వతంగా కోత విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దుర్వినియోగమైన రూ.14,42,826లను రికవరీ చేయాలని ఆదేశించింది. నందలూరు మండలం పొత్తపి గ్రామ రైతులకు పరిహారం చెల్లించే వ్యవహారంలో అప్పటి నెల్లూరు టీజీపీ భూసేకరణ అధికారి సాయినాథ్ భారీగా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఆయన నుంచి సంజాయిషీ కోరుతూ ప్రభుత్వం 2007 ఏప్రిల్ 12న నోటీసులు జారీ చేయగా, జూలై 23న సాయినాథ్ వివరణ ఇచ్చుకున్నారు. అయితే ఆయన సమాధానంలో సహేతుకత లేకపోవడంతో 2007 సెప్టెంబరు 26న పూర్తి స్థాయి విచారణకు ఆదేశించారు. అప్పటి ఉమ్మడి కడప జిల్లా జాయింట్ కలెక్టరును విచారణాధికారిగా నియమించారు. 2010 అక్టోబరు 6న జాయింట్ కలెక్టరు నివేదిక సమర్పించారు. సాయినాథ్‌పై నమోదయిన అభియోగాలన్నిటికీ ఆధారాలున్నట్లు తేల్చారు. ఈ విచారణ నివేదికపై సంజాయిషీకి అవకాశమిచ్చారు. దీంతో సాయినాథ్ 2022 జూన్ 1న తన వాదన వినిపించారు. ఈ వాదనలు కూడా తిరస్కరించిన ప్రభుత్వం ఆయనపై తీసుకోబోతున్న తుది చర్యలను తెలుపుతూ 2022 సెప్టెంబరు 5న చివరి నోటీసు జారీ చేసింది. 2022 నవంబరు 9న సాయినాథ్ కూడా తన తుది వాదనలతో కూడిన సంజాయిషీని ప్రభుత్వానికి సమర్పించారు. అంతే అంతటితో ఈ కేసు మరుగున పడింది. తాజాగా ప్రభుత్వం ఈ కేసును పరిశీలించి అక్రమాలకు బాధ్యుడుగా నిర్ధారించిన సాయినాథ్ పెన్షన్‌లో 50 శాతం మొత్తాన్ని శాశ్వతంగా కోత విధించింది. దుర్వినియోగమైన రూ.14,42,826లను కూడా ఆయన నుంచి రికవరీ చేయాలని ఆదేశిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్.పి.శిశోడియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పుట్టి ముంచిన నకిలీ విత్తనం

- రూ. లక్షల్లో నష్టపోయిన రైతు
- పైరు పరిశీలించిన ఏడీఏ శివశంకర్
- ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామీ

బి.కొత్తకోట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలను కొని మోసపోయానంటూ ఓ రైతు ఫిర్యాదు చేయడం తో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు బుధ వారం పొలాన్ని పరిశీలించారు. బి.కొత్తకోటవాసి రైతు రామాంజులు కర్ణాటక రాష్ట్రం హసన్‌కు చెందిన ఓ కంపెనీ విత్తనాలను కొనుగోలు చేసి 10 ఎకరాల్లో మి రప పైరు సాగు చేశాడు. సుమారు రూ.20 లక్షల దాకా ఖర్చు చేసినా తగిన దిగుబడి రాకపోవడంతో తనకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్ర బాబుకు ఫిర్యాదు చేశారు. దీంతో వ్యవసాయశాఖ మదనపల్లె ఉపసంచాలకుడు శివశంకర్, ఉద్యాన పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త దత్తారెడ్డి, మండల వ్యవసా యాధికారి చంద్రశేఖర్ మిరప పైరును పరిశీలించారు. పంటదిగుబడి రాకపోవడం, మిరపకాయలు వంకరగా ఉండటం, తెగుళ్ల తీవ్రతపై అధ్యయనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మిరప పంట ఉద్యానశాఖ పరిధిలోకి వస్తుందని, తమ పరిధిలో తాము చేయాల్సింది చేస్తామన్నారు. తమ పరిశీలనలో తేలిన అంశాలతో రాష్ట్ర ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరె క్టర్ ఆఫ్ రీసెర్చ్‌కు నివేదిక పంపుతామని, తదుపరి చర్యలు ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ఉంటా యని ఉద్యానశాఖ శాస్త్రవేత్త వివరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి భీమేష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.


మిరపపైరును పరిశీలిస్తున్న వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు

నాలుగేళ్లకే.. నూరేళ్లు..

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి

బి.కొత్తకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఓ చిన్నా రికి నాలుగేళ్లకే నూరేళ్లు నిండిపోయాయి. బి. కొత్తకోట మండలం బడికాయలపల్లెలో బుధవారం ఉదయం జరిగిన ఈ సంఘటన వివరాలు స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఇమ్రాన్ కొత్త ఇంటిని నిర్మిస్తున్నాడు. నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చింది. బుధ వారం ఉదయం తన కుమార్తె జారా సిద్దిఖా (4)తో కలిసి కొత్తఇంటి దగ్గరకు వెళ్లాడు. కుమార్తె ఆడుకుంటూ ఉండగా మరో పనిమీద పాత ఇంటి దగ్గరకు వచ్చాడు. ఆ సమయంలో ఇంటి ఆవరణ లో నిర్మించిన సంపులోకి తొంగి చూస్తున్న బాలిక ప్రమాదవశాత్తూ అందులో పడిపోయింది.

అక్కడ ఎవరూ లేకపోవడంతో నీటిలో మునిగి పో యింది. కొద్దిసేపటికి అక్కడికి వచ్చి న తండ్రి కూతురి కోసం వెతకగా నీటిలో పడి ఉండడం కనిపించింది. దీంతో బిడ్డను బయటకు తీసి హుటా హుటిన స్థానిక ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే ఆ చిన్నారి మృతి చెందినట్లు వైద్యుడు ధ్రువీకరిం చాడు. దీంతో తల్లిదండ్రులు, బంధుమిత్రుల శోకానికి అవధులు లేకుండా పోయాయి.


చిన్నారి జారా (ఫైల్)

తండ్రి మందలించాడని

గొంతు కోసుకున్న యువకుడు

మదనపల్లె అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):తండ్రి మందలించారని ఓ యువకుడు గొంతు కోసుకున్నాడు. పోలీసుల కథనం మే రకు మదనపల్లె పట్టణం, రింగ్‌రోడ్డులో కాపురం ఉంటున్న షేక్ నాసీర్ కుమారుడు షేక్ షారూక్ (30) టమోటా మార్కెట్‌లో కూలీగా పని చేస్తుంటాడు. చెడు తిరుగుళ్లు తిరుగుతూ ఉండడంతో బుధవారం తండ్రి మందలించాడు, దీంతో మనస్తాపానికి గురైన అతను కూరగాయలు కోసే కత్తితో గొంతు కోసుకున్నాడు. కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


గొంతు కోసుకున్న యువకుడు

టమోటా యార్డులో మారిన వేలం విధానం


నాలుగు వరసల్లో పేర్చిన టమోట క్రేట్లను వేలం వేస్తున్న వ్యాపారులు

మదనపల్లె టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోట మార్కెట్‌లో వేలం విధానాన్ని మండీ యజమానులు, వ్యాపారులు మార్చారు. బుధవారం స్థానిక టమోటా మార్కెట్‌లో రైతులు తీసుకొచ్చిన టమోట క్రేట్లను నాలుగు వరుసలు ఎత్తుగా పేర్చి వేలం నిర్వహించారు. రైతులే గ్రేడింగ్ చేయించుకుని రావాల్సిందిగా ట్రేడర్స్ కోరారు. దీని వలన గ్రేడింగ్ సమయం ఆదా అవుతుందని, రైతులకు కూడా మంచి ధర వచ్చే అవకాశం ఉందన్నారు. ఇకపై జాక్‌పాట్ విధానం ఉండదని మార్కెట్ కమిటీ సెక్రటరీ అభిలాష్ తెలిపారు. కార్యక్రమంలోమండీ ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్ర, సభ్యుడు పృథ్వీ, వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

సుండుపల్లె, మార్చి5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 2వ తేదీన ప్రమాదంలో గాయపడిన రేపన అజయ్‌కుమార్ అనే వ్యక్తి తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ముడుంపాడు గ్రామ పంచాయతీ కుర్వపల్లి వద్ద ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో అతను గాయపడ్డాడు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి):కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. ఆస్పత్రి అవుట్ పోలీసుల సమాచారం మేరకు రామసముద్రం మండలం, నారిగానిపల్లెపంచాయతీ, దిగువవారిపల్లెకు చెందిన సుబ్రమణి భార్య శ్రావ ణి(26)కి గర్భసంచి తొలగించాలని వైద్యులు తెలిపారు. కాగా బుధవారం కడుపు నొప్పి ఎక్కువ కావడంతో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రామసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

9న జూడో సెలక్షన్స్

కడప స్పోర్ట్స్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) :నగర ఇండోర్ మునిసిపల్ స్టేడి యంలో ఈనెల 9వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో జూడో క్రీడాకారుల సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి ఎం. నవీన్ కుమార్ తెలిపారు. ఇందులో 15 సంవత్సరాల నుంచి 21 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన జూడో క్రీడాకారులు తమ వయసు ధృవీకరణ పత్రంతో పాటు, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని కోరారు.

డీకేటీ రైతులకు నమోదు ఏదీ?



రైతులకు అందించనున్న యూనిక్ ఐడీ కార్డు

- ఫార్మర్స్ రిజిస్ట్రీలో సొంతపట్టాదారులకే నమోదు
- యూనిక్ నెంబర్ కేటాయింపు
- ఆందోళనలో డీకేటీ రైతులు

వేంపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం వివిధ పథకాలు అమలు చేస్తున్నాయి. అన్నదాతలకు ఆ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రస్తుతం వివిధ పద్ధతులను అవలంభిస్తున్నారు. అయితే భవిష్యత్తులో రైతులకు అందజేసే అన్నదాత సుఖీభవ నిధులు, పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, సబ్సిడీ పరికరాలు, పంట నష్టపరిహారం, ఎరువుల రాయితీలు, కనీస మద్దతు తదితర వాటిని ప్రత్యేక కార్డు ద్వారా అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం అర్హులైన ప్రతి రైతుకు ఆధార్‌కార్డు తరహాలో వ్యవసాయ శాఖ ద్వారా 14 అంకెల యూనిక్ ఐడీ కేటాయిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు సొంత పట్టా భూములు ఉన్న రైతుల వివరాలను మాత్రం నమోదు చేసి యూనిక్ ఐడీ నెంబర్ కేటాయిస్తున్నారు. కానీ డీకేటీ పట్టాలు ఉన్న రైతుల వివరాలు నమోదు చేయడం లేదు. ఇందుకు ఆన్‌లైన్‌లో అనుమతించడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో డీకేటీ రైతులు తమకు పథకాలు, నిధులు అందుతాయో లేదో అని ఆందోళన చెందుతున్నారు.

సొంత పట్టాదారులకు నమోదు...

వేంపల్లె మండలంలో గత 15రోజులుగా అన్ని గ్రామాల్లో రైతులకు యూనిక్ ఐడీ నెంబర్ కేటాయింపు కోసం వ్యవసాయ శాఖ సిబ్బంది తిరుగుతున్నారు. రైతుల వద్దకే వెళ్లి వారి భూమి పాసు బుక్కు, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ ద్వారా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి యూనిక్ ఐడీ కార్డుకు నెంబర్ కేటాయిస్తున్నారు. ఆయా రైతు సేవా కేంద్రాల్లో కూడా నమోదు ప్రక్రియ సాగుతోంది. మండల వ్యాప్తంగా 4100 మంది రైతులకు సంబంధించి సుమారు 14500 ఎకరాల భూమిని నమోదు చేశారు. ఇంకా 300 మంది దాకా రైతుల వివరాలు నమోదు చేయాల్సి ఉంది. కాగా, యూనిక్ ఐడి కార్డు కోసం డీకేటీ భూములున్న ఏ ఒక్క రైతు వివరాలు నమోదు చేసేందుకు ఆన్‌లైన్‌లో అనుమతి లేదు. ఒక్క వేంపల్లె మండలంలోనే 920 మంది రైతులకు సంబంధించి 2వేల ఎకరాల దాకా నమోదు కావాల్సి ఉంది. ఆ రైతులందరు యూని క్ ఐడీ కార్డు మాకు ఇవ్వరా, కార్డు ద్వారా సంక్షేమ ఫలాలు అందిస్తే.. మా పరిస్థితి ఏమిటని వ్యవసాయశాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు.


యూనిక్ ఐడి కార్డు కోసం రైతుల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

డీకేటీలకు అనుమతి ఇవ్వలేదు

మండలంలో సొంత పట్టాదారులకు సంబంధించి యూనిక్ ఐడీ కార్డు నమోదు కోసం సుమారు 95శాతం పూర్తైంది. డీకేటీ రైతులకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదుకు అప్రూవల్ ఇవ్వ లేదు. త్వరలోనే అనుమతి వస్తుందని ఉన్నతాధికారులు చెబు తున్నారు. డీకేటీ రైతుల వివరాలను నమోదు చేసి యూనిక్ ఐడీ నెంబర్ కేటాయిస్తాం.

-రాజేంద్రప్రసాద్,
వ్యవసాయాధికారి, వేంపల్లె.

రైతు సంఘాలకు రాయితీ రుణాలు

- ఉద్యాన శాఖ డీడీ సుభాషిణి


సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానశాఖ డీడీ సుభాషిణి

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రైతులు సంఘాలుగా ఏర్పడితే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలలో 75శాతం రాయితీలు పొందవచ్చని ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ సుభషిణి తెలిపారు. రైతులు, ఉత్పత్తి దారుల సంఘాలకు బుధవారం ఉద్యానశాఖ కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ సుభషిణి మాట్లాడుతూ రైతు గ్రూపుల ఏర్పాటు ఆవశ్యకత, కలిగే ప్రయోజనాలపై సమగ్రంగా వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎ.నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు గ్రూపులుగా ఏర్పడి ఐకమత్యంగా ఉంటే ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చన్నారు. అదేవిధంగా వ్యవసాయరంగంలో కీలకపాత్ర పోషించాలన్నారు. రైతు గ్రూపులను మరింత శక్తివంతం చేయవచ్చన్నారు. లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ జనార్దన్ మాట్లాడుతూ రైతులు, ఉత్పత్తిదారుల సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. నాబార్డు డీడీఎం విజయ్‌విహారి మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల అభివృద్ధికి నాబార్డు ద్వారా సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి జ్యోతిర్మయి, ఉద్యానశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడిపై కేసు

వేంపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న తిరుపతిరావుపై కేసు నమోదు చేసనట్లు ఆర్కేవ్యాలీ ఇన్‌చార్జి ఎస్‌ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. విద్యార్థినిని అసభ్యంగా మాట్లాడినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా : డీఎస్పీ

కడప క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కడప సబ్ డివిజను పరిధిలో గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామని... ఎక్కడైనా విక్రయాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలతో నిఘా ఉంచామని తెలిపారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం వస్తే నేరుగా పోలీసులకు తెలియజేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు కోసం పిల్లలు ఇంజక్షన్లు కూడా వాడుతున్నట్లు సమాచారం వచ్చిందని.. అలాంటి వారిని గుర్తించి ఎడిక్షన్ సెంటరుకు పంపించి కౌన్సెలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి విక్రయాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నామని తెలిపారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు నిఘా ఉంచాలని.. వారు ఎక్కడెక్కడ తిరుగుతున్నారు.. ఎవరితో మాట్లాడుతున్నారనే విషయంపై దృష్టి సారించాలన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యత వహిస్తే వారు సన్మార్గంలో వెళ్లే అవకాశం ఉంటుందని సూచించారు.

యువకుడిపై దాడి... కేసు నమోదు

కడప క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఏఎస్‌ఆర్ నగర్ వద్ద ఓ యువకుడిపై కర్రతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి నట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఏఎస్‌ఆర్ నగర్‌కు చెందిన రామాంజనేయులు బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం రోడ్డు మీద ఉండగా అక్కడే ఉన్న ఆటో డ్రైవరు ప్రశాంత్‌ల మధ్య మాటమాట పెరిగింది. దీంతో రామాంజ నేయులు తలపై కర్రతో దాడి చేయడంతో తలకు గాయమైనట్లు తెలి పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు వైవీయూలో క్యాంపస్ డ్రైవ్

కడప ఎడ్యుకేషన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీ ఉదయం 10గంటలకు రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు వైవీయూ ప్రజా సంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి.సరిత ఒక ప్రకటనలో తెలిపారు. దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్, శ్రీచైతన్య స్కూల్ ప్రతి నిధులు క్యాంపస్ ఎంపికలకు రానున్నారని వివరించారు. డిగ్రీ, పీజీ అర్హతలు కలిగిన విద్యార్థులు ఉద్యోగ ఎంపికలకు హాజరు కావాలని సూచించారు. కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, తెలుగు, ఇంగ్లీష్, మ్యాథమే టిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్స్, సోషల్ స్టడీస్ స్పెషలైజేషన్లను కలిగిన విద్యార్థులు విశ్వవిద్యాలయ నూతన పరిపాలన భవనంలోని ప్లేస్‌మెంట్ సెల్‌లో హాజరై ప్రయోజనం పొందాలని సూచించారు.

సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

బద్వేలు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని రామాంజనేయనగర్ సచివాలయం వార్డు పరిధిలోని ఓ ఉద్యోగిని తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆయన వివరాల మేరకు.. రామాంజనేయనగర్ సచివాలయంలో వార్డు పరిపాలన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కోన గిరిబాబు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యారని, అలాగే ఫోన్‌లో కూడా అందుబాటులోకి రాకపోవడంపై సస్పెం డ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్వేలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ సూచించారు.

గండికోట ముంపువాసుల సమస్యలను పరిష్కరిస్తాం

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల

కొండాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) గండికోట నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు చేపడతామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామనాయుడు తెలిపారు. బుధవారం అమరావతిలోని మంత్రి కార్యాలయంలో నీటిపారుదల సెక్రటరీ సాయిప్రసాద్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ రామచంద్ర, ప్రభుత్వవిప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారా యణరెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి, ముంపు వాసులతో కలిసి మంత్రి సమావేశమయ్యారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో నిర్వాసితుల పరిహారం కోసం రూ.150 కోట్లు కేటయించామన్నారు. ముఖ్యమంత్రి జగన్ నిర్వాసితులకు రూ.500 కోట్ల మేర పరిహారం ఇవ్వకుండా కేవలం జీవో మాత్రమే ఇచ్చారన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం నిర్వాసితులకు న్యాయం చేసేందుకు కట్టుబడి ఉందన్నారు.

ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఒకేసారి అంత మొత్తంలో పరిహారం చెల్లించేందుకు సాధ్యపడదని.. విడతల వారీగా పరిహారం చెల్లిస్తామని మంత్రి తెలిపారు. గండికోట పునరావాస కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, శ్మశానవాటికలు తదితర మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గండికోట నిర్వా సితులు పునరావాసకాలనీల్లో నిర్మించుకున్న ఇళ్లకు ఇళ్ల పట్టాల ను ఇప్పిస్తామని మంత్రి తెలిపారు. అర్హులై ఉండి కూడా పరిహా రం అందని నిర్వాసితులు 22 ముంపు గ్రామాల్లో చాలా మంది ఉన్నారని, వారికి తిరిగి సర్వే నిర్వహించి పరిహారం ఇప్పించాలని నిర్వాసితులు కోరగా మంత్రి అంగీకరించారు. గండికోట నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని ఎమ్మెల్యే, భూపేశ్ కోరారు. అలాగే తిమ్మాపురం చెరువు కింద ముంపునకు గురవుతున్న దొంకపల్లె గ్రామానికి పరిహారం ఇవ్వాలని మంత్రి దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన మంత్రి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో మండల కూటమి ఇన్‌చార్జ్ శివనారాయణరెడ్డి, గండికోట ముంపువాసులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


గండికోట నిర్వాసితులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మలరామనాయుడు

అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలింపు

- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు
- అడ్డుకున్న గ్రామస్థులు

అట్లూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లాయపల్లె చెరువు తట్టు, ప్రభుత్వ భూముల నుంచి శనివారం నుంచి బద్వేలుకు చెందిన వైసీపీ నాయకుడు అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వి తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఎలా గ్రావెల్ తరలిస్తారని ప్రశ్నించగా.. రెవెన్యూ అధికారులకు చలానా కడుతున్నామని చెప్పారు. దీంతో గ్రామస్తులు ఆధారాలు చూపమని అడగ్గా.. వారి వద్ద ఇటువంటి ఆధారాలు లేకపో వడంతో పరారయ్యారు. మళ్లీ మంగళవారం అర్ధరాత్రి సమయంలో బయనపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు టిప్పర్లతో గ్రావెల్‌ను వెంచర్లకు తరలించి లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నట్లు గ్రామస్తులు వెల్లడించారు. దీంతో గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లను మిషనరీని అడ్డుకోవడంతో హిటాచిని వలసపాలెం గ్రామానికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో యజమాని టీడీపీ నాయకులతో గ్రామస్తులతో బేరసారాలు సాగించినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంపై గ్రామస్తులు మండి పడుతున్నారు. దీనిపై స్థానిక తహసీల్దారు సుబ్బలక్ష్మను వివరణ అడగ్గా అక్రమంగా గ్రావెల్ తరలించడంపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.


నల్లాయపల్లె ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్న గ్రామస్థులు

ఆ స్థలంలోకి ఎవరూ ప్రవేశించొద్దు

- తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి

పోరుమామిళ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని 1001 సర్వే నెంబరులో 164 సెక్షన్ అమలులో ఉందని, ఆ స్థలంలోకి ఎవరూ ప్రవేశించొద్దని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సదరు స్థలంలో ఘర్షణ జరిగిందని, అక్కడ ఎవరున్నారనే విషయాలపై బుధవారం ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డి విచారణ జరిపారన్నారు. ఆ స్థలంలో ఎంతమంది ఉంటున్నారనే వివరాలపై ఆరా తీసి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు తిరిగి నిర్ణయం తీసుకునేంత వరకు కొత్త వ్యక్తులు ఆ స్థలంలోకి ప్రవేశించరాదని హెచ్చరికలు జారీ చేశారు.


విచారణ చేస్తున్న ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డి బృందం

వైద్య పీజీ డిగ్రీ పరీక్షలలో టాపర్‌గా నిలిచిన కడప రిమ్స్ డాక్టర్


డాక్టర్ విరాజితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది

కడప సెవెన్‌రోడ్స్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య సహస్ర విశ్వవద్యాలయం వైద్య పీజీ డిగ్రీ పరీక్షలలో రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు (609) సాధించి కడప రిమ్స్ కళాశాల డాక్టర్ పందల విరాజిత ఎన్టీఆర్ వైద్య యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. విద్యార్థిని కృషి, పట్టుదల జనరల్ మెడిసిన్ అధ్యాపకుల మార్గదర్శనంతో గోల్డ్ మెడల్ సాధించినట్లు అడషనల్ డీఎంఈ రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ తెలిపారు. గవర్నమెంట్ మెడికల్ కాలేజీ విద్యార్థులు ఈ స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సదర్భంగా డాక్టర్ విరాజిత మాట్లాడుతూ ఎండోక్రైనాలజీ సూపర్‌స్పెషాలిటీ చేసి రోగులకు సేవ చేయాలని అభిలషిస్తున్నట్లు తెలిపారు. అకాడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయ భాస్కర్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కేబీ యాదవేంద్రరెడ్డి, సహాయ ఆచార్యులు డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ లీలా ప్రసాద్‌బాబు, డాక్టర్ విజయసింహారెడ్డి, డాక్టర్ అర్జున్ అవ్వారు, డాక్టర్ మనోహర్‌లు డాక్టర్ విరాజితకు అభినందనలు తెలిపారు.

పుట్టగొడుగుల పెంపకం.. లాభదాయకం

- కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ కార్యక్రమాలు
- వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి

సికెదిన్నె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగుల పెంపకం లాభదాయకంగా ఉంటుంది. మన పని మనం చేసుకుంటూ తక్కువ ఖర్చుతో తీరిక సమయాల్లో ఇంటిలో కూర్చొని సంపాదించుకునే కుటీర పరిశ్రమగా పుట్టగొడుగుల పెంపకాన్ని చేపట్టవచ్చు. దీనిపై ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో నిరుద్యోగ యువతకు, మహిళలకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి.. వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నారు.

పుట్టగొడుగులు... రకాలు

పుట్టగొడుగుల్లో దాదాపు రెండు వేలకుపైగా రకాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మన దేశంలో ప్రధానంగా నాలుగు రకాల పుట్టగొడుగులను ఎక్కువగా పెంచుతుంటారు. అందులో వైట్ బటన్ మష్రూమ్, ముత్యపు చిప్ప పుట్టగొడుగులు, వరిగడ్డి పుట్టగొడుగులు, పాల పుట్టగొడుగులు ప్రధానమైనవి. ఇందులో మన ప్రాంతంలో ఎక్కువగా పాలపుట్టగొడుగులు, ముత్యపు చిప్ప పుట్టగొడుగులు ఎక్కువగా లభిస్తున్నట్లు, వాటికి గిరాకీ ఉన్నట్లు తెలుస్తోంది.

పుట్టగొడుగుల్లో ఔషధ గుణాలు

పుట్టగొడుగుల్లో అనేక రకాల ఔషదగుణాలు ఉన్నాయి. పుట్టగొడుగులు యాంటీబయాటిక్, యాంటీ క్యాన్సర్, హైపోలిపిడిమిక్, యాంటీహైపర్‌టెన్సన్ లాంటి జబ్బులకు ఔషధాలుగా ఉపయోగపడతాయి. పుట్టగొడుగుల్లో వరి, గోధుమ, కూరగాయల కంటే అధికంగా ప్రొటీన్స్ ఉంటాయి. పీచుపదార్థం ఉంటుంది. పుట్టగొడుగుల్లో కొవ్వు పదార్థాలు ఉండవు. అందరికి ఎంతగానో అనుకూలంగా ఉంటుంది. పొటాషియం, సోడియం, పాస్వరస్‌లు ఎక్కువగా ఉంటాయి. విటమిన్-సి, విటమిన్-బి అధికంగా ఉంటాయి. పిండి పదార్థాలు తక్కువగా ఉండటం వలన షుగర్ వ్యాధి, గుండెజబ్బు లున్న వారికి ఇవి మంచి ఆహారంగా ఉపయోగపడుతాయి.

కుటీర పరిశ్రమగా....

పుట్టగొడుగుల పెంపకంను కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేయడం వలన ఎక్కువ పెట్టుబడి అవసరం లేదు. కాలవ్యవధి తక్కువగా ఉంటుంది. 35 నుంచి 45 రోజుల్లో పెంచవచ్చు. ఇంటి ఆవరణలో వీటిని సులభంగా పెంచుకోవచ్చు. అధిక దిగుబడులు, ఆదాయాన్ని పొందవచ్చు. పంట అయిపోయిన తర్వాత దిండ్లను ఎరువుగా కూడా ఉపయోగించుకునే వీలుంటుంది.



శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



పుట్టగొడుగుల పెంపకంపై యువత, మహిళలకు శిక్షణ కార్యక్రమం ఇస్తున్నాం. ఈ అవకాశాన్ని గ్రామీణ యువత, మహిళలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ శిక్షణను ఉపాధి అవకాశాలుగా మార్చుకునేందుకు ఉపయోగపడుతుంది. ప్రతిసంవత్సరం యువతకు వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు అందిస్తుంటాము. కొందరు సొంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు.

- డాక్టర్‌వీరయ్య, కేవీకే సమన్వయకర్త

పుట్టగొడుగుల పెంపకంతో ఉపాధి




పుట్టగొడుగుల పెంపకాన్ని యువత కుటీర పరిశ్రమలా ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందవచ్చు. పుట్టగొడుగుల్లో ఎన్నో పోషక విలువలు ఉన్నాయి. ప్రస్తుతం వీటి వాడకం పెరిగింది. పుట్టగొడుగులతో కూర, తాలింపు, బిర్యానీ, పుట్టగొడుగుల చాట్, పుట్టగొడుగుల కర్రి తదితర రకాలుగా ఉపయోగించి పిల్లలకు, పెద్దలకు ఇష్టమైన విధంగా తయారు చేసుకోవచ్చు.

- శిల్పకళ, కేవీకే శాస్త్రవేత్త

ఉపాధిలో అక్రమాల జోరు

ఉపాధి హామీ పథకం పనుల్లో క్షేత్రస్థాయిలో అక్రమాలకు తెరతీశారు. పనులు చేయకుండా కూలీలతో కుమ్మక్కై రూ.లక్షల బిల్లులు చేసుకున్నారు. క్షేత్ర సహాయకుడి చేతివాటం అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అదనపు కూలి కావాలంటే రూ.200 చెల్లించాలని డిమాండు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



కందకాల పనులు సంబంధించిన ఎస్టిమేట్


- రైతు పొలంలో పనులు చేయకుండానే బిల్లులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

సంబేపల్లె, మార్చి5(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు కొత్త పద్ధతులను వెతికి కూలీలతో కుమ్మక్కై బిల్లులు కొట్టేస్తున్న సంఘటన సంబేపల్లె మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని ఎస్.సోమవరం గ్రామంలో కె.రామచంద్ర అనే రైతు పొలంలో కందకాల పనులను గత ఏడాది 2022-23లో మంజూరు చేశారు. ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు అక్కడ పనులు చేయకుండానే ఊరిలో లేని కొంత మంది పేర్లను నమోదు చేసి బిల్లులు చేసుకున్నాడని కూలీలు ఆరోపిస్తున్నారు. కందకాల పనులను వర్క్ ఐడీ నెంబర్ 0211047011లో సుమారు మూడు లక్షల రూపాయలతో కందకాల పనులు మంజూరయ్యాయి. ఇప్పటివరకు తన పొలంలో కందకాల పనులే జరగలేదని రైతు చెబుతున్నారు. కానీ రికార్డు ప్రకారం బిల్లులు చెల్లించారు.

నా దృష్టికి రాలేదు..

పనులు కల్పించని విషయం నా దృష్టికి రాలేదు. అలాగే కూలీల నుండి డబ్బులు వసూలు చేస్తున్న విషయం కూడా నా దృష్టికి రాలేదు. ఈ విషయమై విచారించి వాస్తవాలు బయటపడితే కఠిన చర్యలు తీసుకుంటాం. పని అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తాం.

- రెడ్డి జవహర్‌బాబు, ఏపీవో, సంబేపల్లె



తన పొలంలో కందకాల పనులు జరగలేదని చూపుతున్న రైతు

ఉపాధి పనులు కల్పించలేదు..

పని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి పని కల్పించాలని ప్రభుత్వం చెబుతోంది. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకు తమకు పని కల్పించలేదని ఎస్.సోమవారం గ్రామం అగ్రహారం ప్రజలు వాపోతున్నారు. గత ఏడాదిలో చేసిన ఉపాధి పనికి తగిన డబ్బులు రాలేదని, కానీ పనికి వెళ్లని వారికి తమకన్నా ఎక్కువ డబ్బులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఉపాధి సిబ్బందిని ప్రశ్నిస్తే అదనపు కూలి కావాలంటే వారానికి రూ.200 ఇవ్వాలని నిర్మొహమాటంగా డిమాండు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. పనికి రాని వారికి కూడా గతంలో డబ్బులు మార్చిన సంఘటనలు ఉన్నాయన్నారు.



పనులు కల్పించాలని కోరుతున్న అగ్రహారం ప్రజలు

సత్యమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు



వైభవంగా సత్యమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

రైల్వేకోడూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొజ్జావారిపల్లెలో బుధవారం సత్యమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా జరిగింది. ముందుగా హోమాలు, గణపతి, గో, నవగ్రహ పూజలు చేశారు. ప్రతిష్ఠాపన అనంతరం అమ్మవారి విగ్రహానికి అభిషేకాలు చేశారు. అలాగే సత్యమ్మతల్లికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారికి పూజలు చేశారు.

రేపు యల్లమ్మతల్లి తిరునాళ్లు

సుండుపల్లె, మార్చి5 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండల కేంద్రానికి సమీపంలోని చెన్నంశెట్టిపల్లెలో వెలసిన యల్లమ్మ తల్లి తిరునాళ్లు ఈనెల 8వ తేదీన అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుణాళ్ల మహోత్సవంలో భాగంగా గురువారం ఉదయం చెన్నంశెట్టిపల్లి పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఊరేగింపు అనంతరం అమ్మవారిని ఆలయంలో చేర్చి పూజలు నిర్వహిస్తామన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలను బ్లాక్ చేయడం తగదు

పెనగలూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ బదిలీల డ్రాఫ్ట్‌లో ఉన్న ఖాళీలను ప్రభుత్వం బ్లాక్ చేయడం తగదని ఎస్టీయూ రాష్ట్ర కన్వీనర్ పిల్లి రామకృష్ణ అన్నారు. స్థానిక మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ డీఎస్సీ నిర్వహించి రిక్రూట్‌మెంట్ జరపాల్సిందిపోయి ఉన్న ఖాళీలను బ్లాక్ చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. దీంతో సుదూర ప్రాంతాల్లో ఎంతోకాలంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు నష్టం జరుగుతుందన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

- ఎంపీడీవో

పెనగలూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మదనపల్లి పట్టణంలో ఈనెల 8వ తేదీన శ్రీనివాస డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించనున్న జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఎస్.విజయరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెక్ మహేంద్ర, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, బిగ్‌సీ, ఫోన్‌పే, ఫ్లిప్‌కార్ట్, టాటా క్యాపిటల్ తదితర కంపెనీలు ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు జాబ్‌మేళాలో పాల్గొనాలని ఆయన తెలిపారు.

వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలి

రామాపురం, మార్చి5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా గ్రామ నాయకులు పరిశీలించాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశించినట్లు లక్కిరెడ్డిపల్లె మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దిరేవుల రమేశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ ఓబుల్‌రెడ్డిగారిపల్లెలో బుధవారం తాగునీటి బోరును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి, ఆయన సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డికి గ్రామప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గడికోట ఆంజనేయరెడ్డి, చంద్రహాస్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుద్దమళ్ల శంకరయ్య, శ్రీరాములు, టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చలో పిఠాపురం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జనసేన నేతలు



ఆవిర్భావ సభను విజయవంతం చేయండి

- పోస్టర్లను ఆవిష్కరించిన జనసేన నాయకులు

రాయచోటిటౌన్, మార్చి5 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14వ తేదీన పిఠాపురంలో జరగనున్న జనసేన పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ రాజంపేట పార్లమెంట్ నాయకుడు రామాశ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నాయకులు రెడ్డిప్రసాద్‌నాయుడు, పార్టీ శ్రేణులతో కలిసి చలో పిఠాపురం పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ప్రదీప్, రెడ్డిప్రసాద్‌నాయుడు, బుల్లెట్ విజయ్, వెంకటేశ్, శివారెడ్డి, బాషా తదితరులు పాల్గొన్నారు.

వీరబల్లిలో..

వీరబల్లి, మార్చి5(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్లను బుధవారం మండల కేంద్రంలోని బస్టాండులో జనసేన మండల నాయకులు గుగ్గిళ్ల నాగార్జున, సానిపాయి వార్డు మెంబర్ వెంకటేశ్, మండల జనసైనికుల సమక్షంలో విడుదల చేశారు. అనంతరం పోస్టర్లను ఆటోలపై అతికించి ప్రచారం చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు జయరామయ్య, జనసైనికులు కిశోర్, అనిల్‌కుమార్, శ్రీనివాసులు, అలీ, కుమార్, వినోద్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న జనసైనికులు

ఘనంగా ఫుడ్ ఫెస్ట్

రాజంపేట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలం బోయనపల్లెలో ఉన్న శాన్వి ఇంటర్నేషనల్ స్కూలులో బుధవారం ఫుడ్ ఫెస్ట్ వేడుకను ఘనంగా నిర్వహించారు. పిల్లలు రకరకాల వంటకాలు చేసుకుని తీసుకొచ్చారు. పిల్లల వంటకాల ప్రదర్శన చూపరులను ఆకట్టుకుందని పాఠశాల చైర్మన్ కొండూరు శరత్ కుమార్‌రాజు తెలిపారు. వంటకాల తయారీలో పిల్లలకు సహకరించిన తల్లిదండ్రులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో సీఈవో శంకర్‌రాజు, ప్రిన్సిపాల్ విజయనిర్మల, వైస్ ప్రిన్సిపాల్ జయశ్రీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



చూపరులను ఆకట్టుకున్న విద్యార్థుల ఫుడ్‌ఫెస్ట్ ప్రదర్శన

గ్రేడ్-ఏ రాయిని సరఫరా చేయాలి

- పల్వరైజింగ్ మిల్లుల ఓనర్స్ అసోసియేషన్



సీపీవో సుదర్శన్‌రెడ్డితో మాట్లాడుతున్న ముగ్గురాయి మిల్లుల యజమానులు

ఓబులవారిపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏపీఎండీసీ సంస్థ పరిధిలో ఉన్న పల్వరైజింగ్ మిల్లులకు గ్రేడ్-ఏ ముగ్గురాయి సరఫరాకు అనుమతి ఇవ్వాలని పల్వరైజింగ్ మిల్లుల ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు డిమాండు చేశారు. ఈ మేరకు బుధవారం వారు సీపీవో సుదర్శన్‌రెడ్డిని కలిసి మాట్లాడారు. ఏపీఎండీసీకి అనుబంధంగా పనిచేస్తున్న మిల్లులకు గ్రేడ్-ఏ సరఫరాకు డిసెంబరు నెలలో డబ్బులు చెల్లించి డెలివరీ ఆర్డర్ల కోసం ఎదురు చూస్తున్నామన్నారు. అయితే ఇంత వరకు ముగ్గురాయి సరఫరా చేయకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నామన్నారు. కరెంటు బిల్లులు, మిల్లు ఆపరేటర్లు, కార్మికుల వేతనాలు చెల్లించడానికి కష్టంగా ఉందని వాపోయారు. ఈ సమస్యను ఎండీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు. అనంతరం పల్వరైజింగ్ మిల్లుల ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మాచినేని విశ్వేశ్వరనాయుడు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

ప్రశాంతంగా ఉపవాస దీక్షలు

- ఎస్ఐ శ్రీనివాసులు

సుండుపల్లె, మార్చి5(ఆంధ్రజ్యోతి): పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కావడంతో ముస్లింలు ప్రశాంత వాతావరణంలో ఉపవాస దీక్షలు చేసుకోవాలని ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సుండుపల్లె పోలీస్‌స్టేషన్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. ఎవరైనా అల్లరి చిల్లర చేష్టలు చేస్తే పోలీసుల దృష్టికి తీసుకురావాలని, యువకులు రోడ్ల మీదికి వచ్చి అల్లరి చేయకుండా తల్లిదండ్రులు బాధ్యతలు తీసుకోవాలన్నారు. రాత్రిపూట ద్విచక్ర వాహనాలతో పోటీపడి నడపడం, రాత్రివేళ అనవసరంగా బయటతిరగడం వంటి అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



శాంతి సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ శ్రీనివాసులు

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

పెనగలూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని సైబర్ నేరగాళ్లు ఎక్కువయ్యారని, ప్రజలు ఈ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా పెనగలూరు బ్రాంచ్ మేనేజర్ ఎం.వెంకటసురేశ్ సూచించారు. బుధవారం బ్యాంకు ఆవరణలో రాజమండ్రికి చెందిన బాబు కల్చరల్ ఆర్ట్స్ బృందం కళాజాత ద్వారా సైబర్ నేరాలపై ఖాతాదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. బంధువులకు బాగలేదనో, ఉద్యోగం ఇప్పిస్తామనో, లాటరీ తగిలిందనో.. ఇలా రకరకాల కారణాలు చెప్పి ఆధార్ నంబరు, బ్యాంకు అకౌంట్ నంబర్లను వాట్సాఫ్ ద్వారా ఓటీపీ నంబర్లు అడుగుతారని, వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పవద్దని సూచించారు. అపరిచిత ఫోన్ నంబర్లను పూర్తిగా నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది రహంతుల్లా, గౌతమ్, విష్ణువర్ధన్, మహమ్మద్‌అలీ, కాకి అజయ్, మీసాల నరసింహులు పాల్గొన్నారు.

రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు



ఉపాధి పనులు కల్పించాలి

ఓబులవారిపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు సంవత్సరానికి 300 రోజులు పని కల్పించి కూలి 700 రూపాయలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీటీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సంఘం జిల్లా అధ్యక్షుడు పండుగోల మణి మాట్లాడుతూ గ్రామాల్లో పనులు లేక వందలాది మంది ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారని, వలసలను ఆపాలంటే సంవత్సరంలో 300 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాజంపేట నియోజకవర్గ కార్యదర్శి గుడిసె నరసింహులు, రైల్వేకోడూరు నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు మొగిలి వినయ్, ఎం.జయరామయ్య, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మల్లికా రమణయ్య, కె.వెంకటరమణ, గంగయ్య, కె.గుర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

పదిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

వీరబల్లి, మార్చి5(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని డిప్యూటీ డీఈవో సాంబశివారెడ్డి అన్నారు. బుధవారం ఆయన వీరబల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల, కేజీబీవీ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా పరీక్షలకు సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమలో ఎంఈవో కృష్ణయ్య, జెడ్పీ పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌యం రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

'పకడ్బందీగా నిర్వహిస్తాం'

రైల్వేకోడూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని ఎంఈవో సుందర్‌బాబు తెలిపారు. బుధవారం స్థానిక మండల సభాభవనంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొత్తం ఆరు కేంద్రాల్లో, 1212 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. ప్రతి కేంద్రంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మాస్ కాపీయింగ్‌కు తావులేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు : హౌసింగ్ పీడీ

వీరబల్లి, మార్చి5(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ పక్కా గృహాలు మంజూరు చేయడం జరుగుతుందని హౌసింగ్ పీడీ సాంబశివయ్య అన్నారు. వీరబల్లిలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆయన సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గృహ నిర్మాణం పూర్తి కాని ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. త్వరలో వాటిని పూర్తి చేసే బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం ఆయన నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నూర్జహాన్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారత, సమానత్వం కోసం నిరంతర పోరాటం

- ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గాభవాని

రాయచోటిటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత, సమానత్వం కోసం నిరంతర పోరాటాలు చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని షిరిడీసాయి మహిళా డిగ్రీ కళాశాలలో మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మైత్రి సుమిత్ర అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంతర్జాతీయ లింగ సమానత్వ సూచిక ప్రకారం ప్రస్తుతం భారతదేశంలో 108 మహిళలకు 193 మంది పురుషులు ఉన్నారన్నారు. ఇప్పుడున్న పరిస్థితి ప్రకారం ఇలాగే కొనసాగితే భారతదేశంలో సమానత్వం సాధించడానికి 2058 సంవత్సరాలు పట్టవచ్చునని నిపుణులు అంచనా వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ లక్ష్మీప్రసన్న, కళాశాల కరస్పాండెంట్ బసమ్మ, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సరోజమ్మ, రాయచోటి పట్టణ మహిళా లీడర్లు హరిత, ప్రమీల, రమాదేవి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

బాలికలకు చిత్రలేఖన పోటీలు

రాయచోటి పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో లింగ సమానత్వంపై మహిళా పోలీసుస్టేషన్ ఎస్ఐ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బాలికలు తమ సృజనాత్మకతను ఉపయోగించి లింగ సమానత్వం ప్రాముఖ్యతను తెలియజేసే చిత్రాలను గీశారని, విజేతలకు ఈనెల 8వ తేదీన బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. అలాగే స్థానిక నేతాజీ సర్కిల్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఏసీడీపీవో సుగుణమ్మ ఆధ్వర్యంలో లింగ వివక్ష, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల అధ్యాపకులతో పాటు మహిళా పోలీస్‌స్టేషన్ సిబ్బంది, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు భవితకు అవరోధాలు

సిద్దవటం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : బాల్య వివాహాల వల్ల అనేక అనర్థాలు జరిగే అవకాశం ఉంటుందని, ఇవి భవిష్యత్తుకు అవరోధాలుగా నిలుస్తాయని ఐసీడీఎస్ సీడీపీవో ఎన్.శోభారాణి పేర్కొన్నారు. మండలంలోని మాధవరం-1 పంచాయతీ పార్వతిపురంలో ఉన్న ఎస్వీబీవీడీ హైస్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం కిశోర బాలికలకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ బాల్య వివాహాలతో ప్రతి ఆడపిల్ల తప్పనిసరిగా అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు అయిన పోలీసు 100, దిశ 112, మహిళా హెల్ప్‌లైన్ 1098 నంబర్ల గురించి పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు శ్రీవిద్య, వరలక్ష్మీ, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని సిద్దవటం ఏఎస్ఐ సుబ్బరామచంద్ర పిలుపునిచ్చారు. మండలంలోని బాకరాపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో పురుషులతో సమానంగా ముందుకు అడుగు వేయాలన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

రామాపురం, మార్చి5 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హుస్సేనమ్మ, సుజాత తెలిపారు. మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో బుధవారం ఉమెన్ అండ్ కెరియర్ ఎడ్యుకేషన్ మీద బాలికలకు అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ సందర్భంగా పైతరగతులు చదివే బాలికలకు ఏ గ్రూపు తీసుకుంటే ఏమవుతారో అన్న విషయాన్ని వివరించారు. లైంగిక వేధింపులు వల్ల కలిగే అనర్థాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రామాపురం ఆదర్శ పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హుస్సేనమ్మ

గల్ఫ్‌లో ఎంత పెట్రోలు ఉందో.. అన్ని కన్నీళ్లూ ఉంటాయేమో? తమ కుటుంబాల్లో సంతోషం నింపడం కోసం.. అక్కడి ఎడారుల్లో నానా కష్టాలు అనుభవించేవాళ్లు ఎందరో.. ఉపాధి దొరకక.. దొరికినా నిబంధనలు అతిక్రమించి పనిచేయాల్సి రావడంతో శిక్షలు, ప్రమాదాలు, అనారోగ్యం బారిన పడి అసువులు కోల్పోతున్నారు. చివరికి ఆ మృతదేహం స్వదేశానికి తీసుకుని వచ్చేందుకు వారి కుటుంబ సభ్యులు పలు సమస్యలు ఎదుర్కోవడంతోపాటు భారీగా డబ్బు కూడా ఖర్చు చేయాల్సి వస్తోంది. జిల్లా నుంచి అరబ్ దేశాలకు వలస వెళుతున్న వారిలో పలువురి జీవితాలు దాదాపుగా ఇలాగే ఉంటున్నాయి.



కాసుల వేటలో.. అనంత లోకాలకు..

- జన్మభూమిలో జీవనం భారమై గల్ఫ్‌కు ..
- ఎడారుల్లో ఆవిరవుతున్న బతుకులు..
- నెలలు గడిచినా తిరిగిరాని మృతదేహాలు
- ప్రభుత్వం వైపు బాధిత కుటుంబాల చూపు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయం కలిసి రాక, సొంత ఊళ్లో పనులు లేక.. పిల్లల చదువు , కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చుకునేందుకు ఉమ్మడి కడప జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు కన్న తల్లినీ, పుట్టిన ఊరినీ వదిలి , పొట్ట చేతబట్టుకుని ఎడారి దేశాల బాట పడుతున్నారు. అక్కడ సరైన పని దొరకక, తిరిగి ఇంటికి రాలేక ఇబ్బందులు పడుతున్నారు. ఓ సారి కువైత్‌కు వెళ్లి వస్తే లైఫ్ సెటిలవుతుందని, నాలుగు రాళ్లు వెనకేసుకోవచ్చన్న ఉద్దేశంతో ఉమ్మడి కడప జిల్లాలోని కడప, రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలకు చెందిన వేలాది మంది ప్రతి ఏటా కువైత్‌కు వెళుతున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే..

ఇంట్లో పనికి ఖాదీమ్ వీసా, బయట పనికి సూన్ వీసా అవసరం. కొత్తగా కువైత్‌కు వెళ్లే వారిలో అధిక శాతం డ్రైవర్లుగా, వంట మనుషులుగా ఉపాధి పొందుతుంటారు. మరి కొంతమంది ఇంట్లో వీసా తీసుకుని బయటి పనులు చేస్తుంటారు. ఖాదీమ్ వీసాపై వెళ్లాలంటే రెండు నుంచి మూడు లక్షల రూపాయలు, సూన్ వీసాపై వెళ్లాలంటే మూడు నుంచి ఐదు లక్షలు ఖర్చు చేయాల్సి వస్తుంది. అంత డబ్బు భరించలేని వారు ఖాదీమ్ వీసాలో కువైత్‌కు వెళ్లి, అక్రమంగా బయటి పనులు చేస్తుంటారు. ఇలాంటి వారు పట్టుబడితే అక్కడి ప్రభుత్వం కఠినంగా శిక్షించడంతోపాటు, మన దేశానికి పంపించేస్తుంది. శిక్షలకు గురైనవారు, ఉపాధి లభించని వారు చివరికి ప్రాణాలు సైతం కోల్పోతున్నారు. చనిపోయిన వారి బంధువులెవరైనా అక్కడ ఉంటే.. చకచకా పనులు చేసి మృతదేహాలను స్వదేశానికి పంపిస్తున్నారు. ఎవరూ లేని వారి పరిస్థితి వర్ణనాతీతం.. స్వచ్ఛంద సంస్థలు, దాతలెవరైనా సహకరిస్తే కొన్ని నెలల తర్వాతైనా ఇలాంటి వారి మృతదేహాలు స్వదేశానికి వస్తాయి. ఇటీవల రైల్వే కోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లి, చిట్వేల్ మండలాలకు చెందిన పలువురు ఇలా మృతి చెందారు.

ఏపీఎన్‌ఆర్‌టీ సేవలు

కువైత్‌లో మృతి చెందిన తెలుగువారి మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెన్స్ తెలుగు సొసైటీ కృషి చేస్తోంది. 2017లో ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ సొసైటీని ఏర్పాటు చేశారు. బాధితులకు 50 వేల రూపాయలు మంజూరు చేయడంతో పాటు, మృతదేహాలను వారి స్వగ్రామానికి తరలించేందుకు విమానాశ్రయం నుంచి అంబులెన్స్ సదుపాయం కల్పించారు. గల్ఫ్‌లో భారత రాయబార కార్యాలయంతో అనుసంధానమై సేవలు అందిస్తున్న తెలుగు సోషల్ వలంటీర్స్ మృతదేహాలను తరలించేందుకు అవసరమైన అన్ని కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కాగా, ప్రమాదంలో మృతి చెందిన వారికి వీసా 18 ఉంటే నామినీకి కంపెనీ ఇన్సూరెన్స్ మొత్తం చెల్లిస్తుంది. గల్ఫ్‌కు వెళ్లే చాలా మందికి ఇన్సూరెన్స్‌పై అవగాహన లేకపోవడంతో ఏటేటా ఎంతోమంది అక్కడికి వెళ్లి మోసపోతున్నారు.


ఇటీవల గల్ఫ్‌లో మృతి చెందిన కొప్పల రవికుమార్ మృతదేహం

ప్రభుత్వం ఆదుకుంటుంది



వివిధ కారణాలతో గల్ఫ్‌లో మృతి చెందినవారి కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది. గల్ఫ్‌కు వెళ్తున్న కార్మికులకు వారి దేశంలో వీసాతోపాటు ఇన్సూరెన్స్ కల్పిస్తారు. కానీ ప్రమాదాలు జరిగినప్పుడు ఆ డబ్బు ఏమవుతోందో ఎవరికీ అర్థం కావడం లేదు. అక్కడి చట్టాలపై అవగాహన లేకపోవడంతో, చాలా కుటుంబాలు తమకు రావల సిన ఇన్సూరెన్స్ పొందలేక పోతున్నారు. ఇలాంటి వారికి రాష్ట్ర ప్రభుత్వం టీడీపీ ఎన్‌ఆర్‌ఐ విభాగం ద్వారా అవగాహన కల్పిస్తోంది. గల్ఫ్‌లో మృతిచెందిన కుటుంబాలకు ఐదు లక్షల రూపాయల పరిహారం చెల్లించనున్నట్లు ఇటీవల తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలను జారీచేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గల్ఫ్ బాధితుల కోసం ఏర్పాటు చేసిన ఏపీఎన్ఆర్‌టీ సొసైటీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నాం. గల్ఫ్‌లో ఇబ్బందులు పడుతున్న వారు తమ సమస్యలను మా దృష్టికి తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి వారిని అన్ని విధాలుగా ఆదుకుంటాం. చంద్రబాబు పాలనలో ఏ ఒక్కరికి అన్యాయం జరగదు.

- పంతగాని నరసింహ ప్రసాద్,
టీడీపీ సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

మదనపల్లె టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీనివాస డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి కోరారు. జేసీ ఆదర్శరాజేంద్రన్, జిల్లా అధికారులతో కలసి పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 8న శ్రీనివాస డిగ్రీ కళాశాలలో నిర్వహించే మెగా జాబ్‌మేళాకు 25 మల్టీ నేషనల్ కంపెనీల ప్రతినిధులు వస్తున్నారని, 1500మందికి ఉద్యోగావకాశాలు కల్పించవచ్చన్నారు. టెన్త్ నుంచి పీజీ వరకు చదివిన అభ్యర్థులు ఇంటర్వ్యూలకు అర్హులన్నారు. వివరాలకు 9553202509, 9618971075 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉపాధ్యాయులు పనితీరు మెరుగుపరుచుకోవాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈవో సుబ్రమణ్యం

గుర్రంకొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): విద్యాబోధన తీరు సరిగాలేదంటూ జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రమణ్యం ఉపాధ్యాయులపై మండిపడ్డారు. బుధవారం ఆయన గుర్రంకొండ తెలుగు జడ్పీ హైస్కూల్, ఉర్దూ హైస్కూల్, కండ్రిగ ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కండ్రిగ పాఠశాలలోని విద్యార్థులను మ్యాథ్స్, సైన్స్ అంశాలపై ప్రశ్నలు అడిగారు. సరిగా సమాధానం చెప్పకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు పని తీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. మధ్యాహ్నభోజనం తినే వారి పేర్లు మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం ఎఫ్ఏ-4 పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేంద్రబాబు, హెచ్‌ఎం కమ్మర్‌తాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫారంపాండ్స్‌తో కూలీలకు పని కల్పించండి


సూచనలిస్తున్న డ్వామా పీడీ వెంకటరత్నం

ములకలచెరువు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జాబ్‌కార్డుదారులందరికీ కచ్చితంగా ఉపాధి పనులు కల్పించాలని డ్వామా పీడీ వెంకటరత్నం ఆదేశించారు. సీఎల్‌ఆర్‌సీ భవనంలో బుధవారం నియోజవర్గంలోని ఆరు మండలాల ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామ పంచాయతీలో 25కు పైగా ఫారంపాండ్స్, సేద్యపు కుంటలు తవ్వించాలన్నారు. ఈ పనులను త్వరగా పూర్తి చేస్తే రైతులకు ఎంతో ప్రయోజకంగా ఉంటుందని, పశువులకు, పక్షులకు తాగడానికి నీరుంటుదన్నారు. ఉపాధి కూలీల సంఖ్య పెంచకుంటే చర్యలు తప్పవన్నారు. రోజువారీ కూలి రూ.300 తగ్గకుండా పనులు చేయించడంతోపాటు, ప్రతి కూలీకీ 100 రోజులు పనుల కల్పనకు కృషి చేయాలన్నారు. అనంతరం మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించారు. సమావేశంలో డ్వామా ఏపీడీ మధుబాబు, ఎంపీడీఓ హరినారాయణ, ఆరు మండలాల పీఓలు, ఉపాధి ఇంజనీర్లు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

'నాటుసారా రహిత గ్రామంగా తీర్చిదిద్దుతాం'

సంబేపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పరకలబండ బిడికిని సారా రహిత గ్రామంగా తీర్చి దిద్దుతామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. బుధవారం నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాటుసారాతో కలిగే నష్టాలు ఆర్థిక ఇబ్బందులను ప్రజలకు వివరించారు. నాటుసారా తయారీ ఒకటే జీవనోపాధి మార్గం కాదని సంపాదనకు ఎన్నో మంచి మార్గాలు ఉన్నాయని తెలియజేశారు. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ హిమబిందు, తహసీల్దార్ సుబ్రమణ్యంరెడ్డి, ఎస్ఐ భక్తవత్సలం, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి కుళాయప్ప, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య


గుర్రంకొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అప్పులబాధ తాళలేక ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుర్రంకొండ పంచాయతీ తల్లారివాండ్లపల్లెకు చెందిన వి.శ్రీనివాసులు(48) గొర్రెలను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ పోషణ కోసం అప్పులు చేశాడు. రుణం చెల్లించాలని రుణదాతల నుంచి ఒత్తిడి రావడంతో మంగళవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బుధవారం ఉదయం మజ్జిగవారిపల్లె వద్ద పొలంలో చింతచెట్టుకు ఉరేసుకుని మృతి చెంది ఉండడాన్ని అక్కడి రైతులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని వాల్మీకిపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ నరసింహులు తెలిపారు.

చిన్నారిపై పిచ్చికుక్క దాడి


గాయపడ్డ చిన్నారి వేదశ్రీ

ములకలచెరువు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఆడుకుంటున్న చిన్నారిపై ఓ పిచ్చికుక్క దాడి చేసింది. ఎక్కడ పడితే అక్కడ కరవడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. గ్రామస్థుల కథనం మేరకు...ములకలచెరువు మండలం మద్దినాయనిపల్లె పంచాయతీ బిస్సయ్యగారిపల్లెకు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి ఐదేళ్ల కుమార్తె వేదశ్రీ బుధవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చికుక్క దాడి చేసింది. చిన్నారి కేకలు వేయడంతో కుటుంబీకులు రక్షించి చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. కళ్లపై కరవడంతో కుడి కన్ను వాచింది. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్యుల సూచనల మేరకు తిరుపతి రుయాకు తరలించారు.

టిప్పర్ ఢీకొని యువకుడి దుర్మరణం


యువకుడి మృతదేహం

మదనపల్లె అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ ఢీకొని ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు మదనపల్లె పట్టణం, రెడ్డీస్ కాలనీకి చెందిన దద్దాల శశికుమార్ నాయుడు (28) బైక్‌పై పుంగనూరు నుంచి వస్తుండగా బసినికొండ పంచాయతీ వై జంక్షన్ వద్ద టిప్పర్ ఢీకొంది. దీంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు తాలూకా పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న ఇతని స్వగ్రామం గుర్రంకొండ మండలం, చెర్లోపల్లె పంచాయతీ కమ్మగోవిందపల్లె కాగా, మదనపల్లెలో స్థిరపడ్డారు. ఒక్కగా నొక్క కొడుకును తీసుకుపోయావా దేవుడా అంటూ తండ్రి రాజన్న విలపించాడు.

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు


నిందితులను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

గుర్రంకొండ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు వాల్మీకి పురం సీఐ ప్రసాద్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు గుర్రంకొండ పట్టణానికి చెందిన ఆదిల్(21), కమాల్‌ఖాన్(26), రెడ్డికుమార్(20)లు గంజాయికి బానిసలు కావడంతోపాటు దానిని విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు నిందితులపై రెక్కీ నిర్వహించారు. గుర్రంకొండ మార్కెట్ యార్డు వద్ద బుధవారం వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, ఒక కిలో గంజాయి పట్టుబడింది. దీంతోపాటు రెండు సెల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరుపరిచనట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ మధురామచంద్రుడు సిబ్బంది పాల్గొన్నారు.

పార్వేట ఉత్సవం ఘటనపై ఇరువర్గాలతో చర్చించాం

- మీడియాతో కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు


మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

రాయచోటిటౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పార్వేట ఉత్సవం సందర్భంగా మంగళవారం సాయంత్రం పట్టణంలోని ఠాణా జంక్షన్ వద్ద చోటు చేసుకున్న సంఘటనపై ఇరువర్గాలతో చర్చించామని, గతంలో మాదిరి సఖ్యతగా నడుచుకుంటామని ఒప్పుకునట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు తెలిపారు. పార్వేట ఉత్సవం సందర్భంగా ఏర్పడిన ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా బుధవారం రాత్రి పట్టణంలోని స్టేట్ గెస్టుహౌస్‌లో కలెక్టర్, ఎస్పీ, మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి ముస్లిం పెద్దలు, హిందూ సంఘాల పెద్దలతో విడివిడిగా చర్చలు జరిపారు. సుమారు రెండు గంటల చర్చల అనంతరం ఇరువర్గాలవారు అటు ముస్లిం సంప్రదాయాలను, ఇటు హిందూ సంప్రదాయాలను గౌరవిస్తామని, ఎవరి ఊరేగింపులు జరిగినా సమస్యలు సృష్టించమని అంగీకరించడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో జరగబోయే కార్యక్రమాల విషయంలో కలెక్టర్, ఎస్పీ, తహసీల్దార్‌తో పాటు ఇరువరాలకు చెందిన శాంతికమిటీ సభ్యులతో కలిసి చేపట్టబోయే కార్యక్రమాల రూటు మ్యాప్ నిర్ణయించి రాయచోటి పట్టణంలో ప్రశాంతత నెలకొనేందుకు కృషి చేస్తామన్నారు. అనవసర సమస్యలు సృష్టించకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇరువర్గాలపై ఉందని సూచించారు. ఈ సంఘటనకు సంబంధించిన ఒకవర్గం నుంచి 11మందిని, మరో వర్గం నుంచి 13మందిని అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపెట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో సున్నితమైన సమస్యలపై గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పెన్షన్‌లో 50 శాతం కోత

- భూసేకరణలో అక్రమాల పర్యవసానం
- దుర్వినియోగమైన రూ.14.50 లక్షలు రికవరీ
- 18 ఏళ్లుగా పెండింగులో వున్న కేసు పరిష్కారం

కలికిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏళ్ల తరబడి పెండింగులో వున్న కేసులను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుంటోంది. కడప జిల్లాలో వైఎస్సార్ హయాం నుంచి జరిగిన అవినీతి కేసులను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. తాజాగా ఉమ్మడి కడప జిల్లాలోని పొత్తపి గ్రామంలో భూసేకరణ సందర్భంగా జరిగిన అక్రమాలకు అప్పటి భూసేకరణ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.సాయినాథ్‌ను (ప్రస్తుతం రిటైరయ్యారు) బాధ్యుడుగా తేల్చి, ఆయన పెన్షన్‌లో 50 శాతం శాశ్వతంగా కోత విధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దుర్వినియోగమైన రూ.14,42,826లను రికవరీ చేయాలని ఆదేశించింది. నందలూరు మండలం పొత్తపి గ్రామ రైతులకు పరిహారం చెల్లించే వ్యవహారంలో అప్పటి నెల్లూరు టీజీపీ భూసేకరణ అధికారి సాయినాథ్ భారీగా అక్రమాలకు పాల్పడినట్లు గుర్తించారు. ఆయన నుంచి సంజాయిషీ కోరుతూ ప్రభుత్వం 2007 ఏప్రిల్ 12న నోటీసులు జారీ చేయగా, జూలై 23న సాయినాథ్ వివరణ ఇచ్చుకున్నారు. అయితే ఆయన సమాధానంలో సహేతుకత లేకపోవడంతో 2007 సెప్టెంబరు 26న పూర్తి స్థాయి విచారణకు ఆదేశించారు. అప్పటి ఉమ్మడి కడప జిల్లా జాయింట్ కలెక్టరును విచారణాధికారిగా నియమించారు. 2010 అక్టోబరు 6న జాయింట్ కలెక్టరు నివేదిక సమర్పించారు. సాయినాథ్‌పై నమోదయిన అభియోగాలన్నిటికీ ఆధారాలున్నట్లు తేల్చారు. ఈ విచారణ నివేదికపై సంజాయిషీకి అవకాశమిచ్చారు. దీంతో సాయినాథ్ 2022 జూన్ 1న తన వాదన వినిపించారు. ఈ వాదనలు కూడా తిరస్కరించిన ప్రభుత్వం ఆయనపై తీసుకోబోతున్న తుది చర్యలను తెలుపుతూ 2022 సెప్టెంబరు 5న చివరి నోటీసు జారీ చేసింది. 2022 నవంబరు 9న సాయినాథ్ కూడా తన తుది వాదనలతో కూడిన సంజాయిషీని ప్రభుత్వానికి సమర్పించారు. అంతే అంతటితో ఈ కేసు మరుగున పడింది. తాజాగా ప్రభుత్వం ఈ కేసును పరిశీలించి అక్రమాలకు బాధ్యుడుగా నిర్ధారించిన సాయినాథ్ పెన్షన్‌లో 50 శాతం మొత్తాన్ని శాశ్వతంగా కోత విధించింది. దుర్వినియోగమైన రూ.14,42,826లను కూడా ఆయన నుంచి రికవరీ చేయాలని ఆదేశిస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్.పి.శిశోడియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పుట్టి ముంచిన నకిలీ విత్తనం

- రూ. లక్షల్లో నష్టపోయిన రైతు
- పైరు పరిశీలించిన ఏడీఏ శివశంకర్
- ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామీ


మిరపపైరును పరిశీలిస్తున్న వ్యవసాయ, హార్టికల్చర్ అధికారులు

బి.కొత్తకోట, మార్చి 5(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలను కొని మోసపోయానంటూ ఓ రైతు ఫిర్యాదు చేయడం తో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు బుధ వారం పొలాన్ని పరిశీలించారు. బి.కొత్తకోటవాసి రైతు రామాంజులు కర్ణాటక రాష్ట్రం హసన్‌కు చెందిన ఓ కంపెనీ విత్తనాలను కొనుగోలు చేసి 10 ఎకరాల్లో మిరప పైరు సాగు చేశాడు. సుమారు రూ.20 లక్షల దాకా ఖర్చు చేసినా తగిన దిగుబడి రాకపోవడంతో తనకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్ర బాబుకు ఫిర్యాదు చేశారు. దీంతో వ్యవసాయశాఖ మదనపల్లె ఉపసంచాలకుడు శివశంకర్, ఉద్యాన పరిశోధన కేంద్ర శాస్త్రవేత్త దత్తారెడ్డి, మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ మిరప పైరును పరిశీలించారు. పంటదిగుబడి రాకపోవడం, మిరపకాయలు వంకరగా ఉండటం, తెగుళ్ల తీవ్రతపై అధ్యయనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మిరప పంట ఉద్యానశాఖ పరిధిలోకి వస్తుందని, తమ పరిధిలో తాము చేయాల్సింది చేస్తామన్నారు. తమ పరిశీలనలో తేలిన అంశాలతో రాష్ట్ర ఉద్యానశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌కు నివేదిక పంపుతామని, తదుపరి చర్యలు ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు ఉంటాయని ఉద్యానశాఖ శాస్త్రవేత్త వివరించారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి భీమేష్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లకే.. నూరేళ్లు..

నీటి తొట్టెలో పడి చిన్నారి మృతి


చిన్నారి జారా (ఫైల్)

బి.కొత్తకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఓ చిన్నారికి నాలుగేళ్లకే నూరేళ్లు నిండిపోయాయి. బి. కొత్తకోట మండలం బడికాయలపల్లెలో బుధవారం ఉదయం జరిగిన ఈ సంఘటన వివరాలు స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఇమ్రాన్ కొత్త ఇంటిని నిర్మిస్తున్నాడు. నిర్మాణం దాదాపుగా పూర్తి కావచ్చింది. బుధ వారం ఉదయం తన కుమార్తె జారా సిద్ధిఖా (4)తో కలిసి కొత్తఇంటి దగ్గరకు వెళ్లాడు. కుమార్తె ఆడుకుంటూ ఉండగా మరో పనిమీద పాత ఇంటి దగ్గరకు వచ్చాడు. ఆ సమయంలో ఇంటి ఆవరణలో నిర్మించిన సంపులోకి తొంగి చూస్తున్న బాలిక ప్రమాదవశాత్తూ అందులో పడిపోయింది.

అక్కడ ఎవరూ లేకపోవడంతో నీటిలో మునిగి పోయింది. కొద్దిసేపటికి అక్కడికి వచ్చిన తండ్రి కూతురి కోసం వెతకగా నీటిలో పడి ఉండడం కనిపించింది. దీంతో బిడ్డను బయటకు తీసి హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే ఆ చిన్నారి మృతి చెందినట్లు వైద్యుడు ధ్రువీకరించాడు. దీంతో తల్లిదండ్రులు, బంధుమిత్రుల శోకానికి అవధులు లేకుండా పోయాయి.

తండ్రి మందలించాడని

గొంతు కోసుకున్న యువకుడు


గొంతు కోసుకున్న యువకుడు

మదనపల్లె అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించారని ఓ యువకుడు గొంతు కోసుకున్నాడు. పోలీసుల కథనం వేరకు మదనపల్లె పట్టణం, రింగ్‌రోడ్డులో కాపురం ఉంటున్న షేక్ నాసీర్ కుమారుడు షేక్ షారూక్ (30) టమోటా మార్కెట్‌లో కూలీగా పని చేస్తుంటాడు. చెడు తిరుగుళ్లు తిరుగుతూ ఉండడంతో బుధవారం తండ్రి మందలించాడు, దీంతో మనస్తాపానికి గురైన అతను కూరగాయలు కోసే కత్తితో గొంతు కోసుకున్నాడు. కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

టమోటా యార్డులో మారిన వేలం విధానం


నాలుగు వరసల్లో పేర్చిన టమోట క్రేట్లను వేలం వేస్తున్న వ్యాపారులు

మదనపల్లె టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మదనపల్లె టమోట మార్కెట్‌లో వేలం విధానాన్ని మండీ యజమానులు, వ్యాపారులు మార్చారు. బుధవారం స్థానిక టమోటా మార్కెట్‌లో రైతులు తీసుకొచ్చిన టమోట క్రేట్లను నాలుగు వరుసలు ఎత్తుగా పేర్చి వేలం నిర్వహించారు. రైతులే గ్రేడింగ్ చేయించుకుని రావాల్సిందిగా ట్రేడర్స్ కోరారు. దీని వలన గ్రేడింగ్ సమయం ఆదా అవుతుందని, రైతులకు కూడా మంచి ధర వచ్చే అవకాశం ఉందన్నారు. ఇకపై జాక్‌పాట్ విధానం ఉండదని మార్కెట్ కమిటీ సెక్రటరీ అభిలాష్ తెలిపారు. కార్యక్రమంలోమండీ ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్ర, సభ్యుడు పృథ్వీ, వ్యాపారులు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

సుండుపల్లె, మార్చి5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 2వ తేదీన ప్రమాదంలో గాయపడిన రేపన అజయ్‌కుమార్ అనే వ్యక్తి తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ముడుంపాడు గ్రామ పంచాయతీ కుర్వపల్లి వద్ద ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో అతను గాయపడ్డాడు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి):కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. ఆస్పత్రి అవుట్ పోలీసుల సమాచారం మేరకు రామసముద్రం మండలం, నారిగానిపల్లెపంచాయతీ, దిగువవారిపల్లెకు చెందిన సుబ్రమణి భార్య శ్రావణి(26)కి గర్భసంచి తొలగించాలని వైద్యులు తెలిపారు. కాగా బుధవారం కడుపు నొప్పి ఎక్కువ కావడంతో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబసభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రామసముద్రం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

9న జూడో సెలక్షన్స్

కడప స్పోర్ట్స్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):నగర ఇండోర్ మునిసిపల్ స్టేడియంలో ఈనెల 9వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో జూడో క్రీడాకారుల సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ కార్యదర్శి ఎం. నవీన్ కుమార్ తెలిపారు. ఇందులో 15 సంవత్సరాల నుంచి 21 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన జూడో క్రీడాకారులు తమ వయసు ధృవీకరణ పత్రంతో పాటు, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని కోరారు.

డీకేటీ రైతులకు నమోదు ఏదీ?

● ఫార్మర్స్ రిజిస్ట్రీలో సొంతపట్టాదారులకే నమోదు

● యూనిక్ నెంబర్ కేటాయింపు ● ఆందోళనలో డీకేటీ రైతులు



రైతులకు అందించనున్న యూనిక్ ఐడీ కార్డు

వేంపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం వివిధ పథకాలు అమలు చేస్తున్నాయి. అన్నదాతలకు ఆ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రస్తుతం వివిధ పద్ధతులను అవలంభిస్తున్నారు. అయితే భవిష్యత్తులో రైతులకు అందజేసే అన్నదాత సుఖీభవ నిధులు, పంటల బీమా, పీఎం కిసాన్ యోజన, సబ్సిడీ పరికరాలు, పంట నష్టపరిహారం, ఎరువుల రాయితీలు, కనీస మద్దతు తదితర వాటిని ప్రత్యేక కార్డు ద్వారా అందించేందుకు చర్యలు చేపడుతున్నారు. ఇందు కోసం అర్హులైన ప్రతి రైతుకు ఆధార్‌కార్డు తరహాలో వ్యవసాయ శాఖ ద్వారా 14 అంకెల యూనిక్ ఐడీ కేటాయిస్తున్నారు. అయితే ఇప్పటి వరకు సొంత పట్టా భూములు ఉన్న రైతుల వివరాలను మాత్రం నమోదు చేసి యూనిక్ ఐడీ నెంబర్ కేటాయిస్తున్నారు. కానీ డీకేటీ పట్టాలు ఉన్న రైతుల వివరాలు నమోదు చేయడం లేదు. ఇందుకు ఆన్‌లైన్‌లో అనుమతించడం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో డీకేటీ రైతులు తమకు పథకాలు, నిధులు అందుతాయో లేదో అని ఆందోళన చెందుతున్నారు.

సొంత పట్టాదారులకు నమోదు...

వేంపల్లె మండలంలో గత 15రోజులుగా అన్ని గ్రామాల్లో రైతులకు యూనిక్ ఐడీ నెంబర్ కేటాయింపు కోసం వ్యవసాయ శాఖ సిబ్బంది తిరుగుతున్నారు. రైతుల వద్దకే వెళ్లి వారి భూమి పాసు బుక్కు, ఆధార్‌కార్డు, ఫోన్ నెంబర్ ద్వారా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేసి యూనిక్ ఐడీ కార్డుకు నెంబర్ కేటాయిస్తున్నారు. ఆయా రైతు సేవా కేంద్రాల్లో కూడా నమోదు ప్రక్రియ సాగుతోంది. మండల వ్యాప్తంగా 4100 మంది రైతులకు సంబంధించి సుమారు 14500 ఎకరాల భూమిని నమోదు చేశారు. ఇంకా 300 మంది దాకా రైతుల వివరాలు నమోదు చేయాల్సి ఉంది. కాగా, యూనిక్ ఐడి కార్డు కోసం డీకేటీ భూములున్న ఏ ఒక్క రైతు వివరాలు నమోదు చేసేందుకు ఆన్‌లైన్‌లో అనుమతి లేదు. ఒక్క వేంపల్లె మండలంలోనే 920 మంది రైతులకు సంబంధించి 2వేల ఎకరాల దాకా నమోదు కావాల్సి ఉంది. ఆ రైతులందరు యూని క్ ఐడీ కార్డు మాకు ఇవ్వరా, కార్డు ద్వారా సంక్షేమ ఫలాలు అందిస్తే.. మా పరిస్థితి ఏమిటని వ్యవసాయశాఖ అధికారులను ప్రశ్నిస్తున్నారు.



యూనిక్ ఐడి కార్డు కోసం రైతుల వివరాలు నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

డీకేటీలకు అనుమతి ఇవ్వలేదు

మండలంలో సొంత పట్టాదారులకు సంబంధించి యూనిక్ ఐడీ కార్డు నమోదు కోసం సుమారు 95శాతం పూర్తైంది. డీకేటీ రైతులకు సంబంధించి ఆన్‌లైన్‌లో నమోదుకు అప్రూవల్ ఇవ్వ లేదు. త్వరలోనే అనుమతి వస్తుందని ఉన్నతాధికారులు చెబు తున్నారు. డీకేటీ రైతుల వివరాలను నమోదు చేసి యూనిక్ ఐడీ నెంబర్ కేటాయిస్తాం.

-రాజేంద్రప్రసాద్,
వ్యవసాయాధికారి, వేంపల్లె.

రైతు సంఘాలకు రాయితీ రుణాలు

● ఉద్యాన శాఖ డీడీ సుభాషిణి



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యానశాఖ డీడీ సుభాషిణి

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రైతులు సంఘాలుగా ఏర్పడితే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలలో 75శాతం రాయితీలు పొందవచ్చని ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ సుభషిణి తెలిపారు. రైతులు, ఉత్పత్తి దారుల సంఘాలకు బుధవారం ఉద్యానశాఖ కార్యాలయంలో అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ సుభషిణి మాట్లాడుతూ రైతు గ్రూపుల ఏర్పాటు ఆవశ్యకత, కలిగే ప్రయోజనాలపై సమగ్రంగా వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎ.నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు గ్రూపులుగా ఏర్పడి ఐకమత్యంగా ఉంటే ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చన్నారు. అదేవిధంగా వ్యవసాయరంగంలో కీలకపాత్ర పోషించాలన్నారు. రైతు గ్రూపులను మరింత శక్తివంతం చేయవచ్చన్నారు. లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ జనార్దన్ మాట్లాడుతూ రైతులు, ఉత్పత్తిదారుల సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. నాబార్డు డీడీఎం విజయ్‌విహారి మాట్లాడుతూ రైతు ఉత్పత్తిదారుల సంఘాల అభివృద్ధికి నాబార్డు ద్వారా సాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి జ్యోతిర్మయి, ఉద్యానశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ అధ్యాపకుడిపై కేసు

వేంపల్లె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో ఫిజిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న తిరుపతిరావుపై కేసు నమోదు చేసనట్లు ఆర్కేవ్యాలీ ఇన్‌చార్జి ఎస్ఐ తిరుపాల్‌నాయక్ తెలిపారు. విద్యార్థినిని అసభ్యంగా మాట్లాడినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా : డీఎస్పీ

కడప క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కడప సబ్ డివిజను పరిధిలో గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచామని... ఎక్కడైనా విక్రయాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలతో నిఘా ఉంచామని తెలిపారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం వస్తే నేరుగా పోలీసులకు తెలియజేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మత్తు కోసం పిల్లలు ఇంజక్షన్లు కూడా వాడుతున్నట్లు సమాచారం వచ్చిందని.. అలాంటి వారిని గుర్తించి ఎడిక్షన్ సెంటరుకు పంపించి కౌన్సెలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి విక్రయాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నామని తెలిపారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు నిఘా ఉంచాలని.. వారు ఎక్కడెక్కడ తిరుగుతున్నారు.. ఎవరితో మాట్లాడుతున్నారనే విషయంపై దృష్టి సారించాలన్నారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు బాధ్యత వహిస్తే వారు సన్మార్గంలో వెళ్లే అవకాశం ఉంటుందని సూచించారు.

యువకుడిపై దాడి... కేసు నమోదు

కడప క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఏఎస్‌ఆర్ నగర్ వద్ద ఓ యువకుడిపై కర్రతో దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి నట్లు తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఏఎస్‌ఆర్ నగర్‌కు చెందిన రామాంజనేయులు బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం రోడ్డు మీద ఉండగా అక్కడే ఉన్న ఆటో డ్రైవరు ప్రశాంత్‌ల మధ్య మాటమాట పెరిగింది. దీంతో రామాంజ నేయులు తలపై కర్రతో దాడి చేయడంతో తలకు గాయమైనట్లు తెలి పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

నేడు వైవీయూలో క్యాంపస్ డ్రైవ్

కడప ఎడ్యుకేషన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీ ఉదయం 10గం టలకు రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నట్లు వైవీయూ ప్రజా సంబంధాల విభాగ సంచాలకులు డాక్టర్ పి.సరిత ఒక ప్రకటనలో తెలిపారు. దివీస్ ల్యాబొరేటరీస్ లిమిటెడ్, శ్రీచైతన్య స్కూల్ ప్రతి నిధులు క్యాంపస్ ఎంపికలకు రానున్నారని వివరించారు. డిగ్రీ, పీజీ అర్హతలు కలిగిన విద్యార్థులు ఉద్యోగ ఎంపికలకు హాజరు కావాలని సూచించారు. కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ, తెలుగు, ఇంగ్లీష్, మ్యాథమే టిక్స్, ఫిజిక్స్ కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, కంప్యూటర్స్ సోషల్ స్టడీస్ స్పెషలైజేషన్లను కలిగిన విద్యార్థులు విశ్వవిద్యాలయ నూతన పరిపాలన భవనంలోని ప్లేస్‌మెంట్ సెల్‌లో హాజరై ప్రయోజనం పొందాలని సూచించారు.

సచివాలయ ఉద్యోగి సస్పెన్షన్

బద్వేలు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని రామాంజనేయనగర్ సచివాలయం వార్డు పరిధిలోని ఓ ఉద్యోగిని తొలగించినట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఆయన వివరాల మేరకు.. రామాంజనేయనగర్ సచివాలయంలో వార్డు పరిపాలన కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కోన గిరిబాబు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యారని, అలాగే ఫోన్‌లో కూడా అందుబాటులోకి రాకపోవడంపై సస్పెం డ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సర్వేలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని కమిషనర్ సూచించారు.

గండికోట ముంపువాసుల సమస్యలను పరిష్కరిస్తాం

●రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల



గండికోట నిర్వాసితులతో మాట్లాడుతున్న మంత్రి నిమ్మలరామనాయుడు

కొండాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) గండికోట నిర్వాసితుల సమస్యలను పరిష్కరించేందుకు తక్షణమే చర్యలు చేపడతామని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామనాయుడు తెలిపారు. బుధవారం అమరావతిలోని మంత్రి కార్యాలయంలో నీటిపారుదల సెక్రటరీ సాయిప్రసాద్, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్ రామచంద్ర, ప్రభుత్వవిప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారా యణ రెడ్డి, జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి, ముంపు వాసులతో కలిసి మంత్రి సమావేశమయ్యారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో నిర్వాసితుల పరిహారం కోసం రూ.150 కోట్లు కేటయించామన్నారు. ముఖ్యమంత్రి జగన్ నిర్వాసితులకు రూ.500 కోట్ల మేర పరిహారం ఇవ్వకుండా కేవలం జీవో మాత్రమే ఇచ్చారన్నారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం నిర్వాసితులకు న్యాయం చేసేందుకు కట్టుబడి ఉందన్నారు.
ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఒకేసారి అంత మొత్తంలో పరిహారం చెల్లించేందుకు సాధ్యపడదని.. విడతల వారీగా పరిహారం చెల్లిస్తామని మంత్రి తెలిపారు. గండికోట పునరావాస కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, శ్మశానవాటికలు తదితర మౌలిక సదుపాయాలను వెంటనే కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గండికోట నిర్వా సితులు పునరావాసకాలనీల్లో నిర్మించుకున్న ఇళ్లకు ఇళ్ల పట్టాల ను ఇప్పిస్తామని మంత్రి తెలిపారు. అర్హులై ఉండి కూడా పరిహా రం అందని నిర్వాసితులు 22 ముంపు గ్రామాల్లో చాలా మంది ఉన్నారని, వారికి తిరిగి సర్వే నిర్వహించి పరిహారం ఇప్పించాలని నిర్వాసితులు కోరగా మంత్రి అంగీకరించారు. గండికోట నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని ఎమ్మెల్యే, భూపేశ్ కోరారు. అలాగే తిమ్మాపురం చెరువు కింద ముంపునకు గురవుతున్న డొంకపల్లె గ్రామానికి పరిహారం ఇవ్వాలని మంత్రి దృష్టికి తెచ్చారు. ఇందుకు స్పందించిన మంత్రి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో మండల కూటమి ఇన్‌చార్జ్ శివనారాయణరెడ్డి, గండికోట ముంపువాసులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి, గ్రావెల్ తరలింపు

● చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

● అడ్డుకున్న గ్రామస్థులు



నల్లాయపల్లె ప్రభుత్వ భూమిలో గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్న గ్రామస్థులు

అట్లూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లాయపల్లె చెరువు తట్టు, ప్రభుత్వ భూముల నుంచి శనివారం నుంచి బద్వేలుకు చెందిన వైసీపీ నాయకుడు అక్రమంగా మట్టి, గ్రావెల్ తవ్వి తరలిస్తుండగా గ్రామస్థులు అడ్డుకున్నారు. అనుమతులు లేకుండా ఎలా గ్రావెల్ తరలిస్తారని ప్రశ్నించగా.. రెవెన్యూ అధికారులకు చలానా కడుతున్నామని చెప్పారు. దీంతో గ్రామస్థులు ఆధారాలు చూపమని అడగ్గా.. వారి వద్ద ఇటువంటి ఆధారాలు లేకపో వడంతో పరారయ్యారు. మళ్లీ మంగళవారం అర్ధరాత్రి సమయంలో బయనపల్లెకు చెందిన వైసీపీ నాయకుడు టిప్పర్లతో గ్రావెల్‌ను వెంచర్లకు తరలించి లక్షల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నట్లు గ్రామస్థులు వెల్లడించారు. దీంతో గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లను మిషనరీని అడ్డుకోవడంతో హిటాచిని వలస పాలెం గ్రామానికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. దీంతో యజమాని టీడీపీ నాయకులతో గ్రామస్థులతో బేరసారాలు సాగించినట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడంపై గ్రామస్థులు మండి పడుతున్నారు. దీనిపై స్థానిక తహసీల్దారు సుబ్బలక్ష్మమ్మను వివరణ అడగ్గా అక్రమంగా గ్రావెల్ తరలించడంపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆ స్థలంలోకి ఎవరూ ప్రవేశించొద్దు

● తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి



విచారణ చేస్తున్న ఆర్ఐ సుధాకర్‌రెడ్డి బృందం

పోరుమామిళ్ల, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసముద్రం పంచాయతీ పరిధిలోని 1001 సర్వే నెంబరులో 164 సెక్షన్ అమలులో ఉందని, ఆ స్థలంలోకి ఎవరూ ప్రవేశించొద్దని తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సదరు స్థలంలో ఘర్షణ జరిగిందని, అక్కడ ఎవరున్నారనే విషయాలపై బుధవారం ఆర్ఐ సుధాకర్‌రెడ్డి విచారణ జరిపారన్నారు. ఆ స్థలంలో ఎంతమంది ఉంటున్నారనే వివరాలపై ఆరా తీసి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు తిరిగి నిర్ణయం తీసుకునేంతవరకు కొత్త వ్యక్తులు ఆ స్థలంలోకి ప్రవేశించరాదని హెచ్చరికలు జారీ చేశారు.

వైద్య పీజీ డిగ్రీ పరీక్షలలో టాపర్‌గా నిలిచిన కడప రిమ్స్ డాక్టర్



డాక్టర్ విరాజితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది

కడప సెవెన్‌రోడ్స్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య సహస్ర విశ్వవద్యాలయం వైద్య పీజీ డిగ్రీ పరీక్షలలో రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు (609) సాధించి కడప రిమ్స్ కళాశాల డాక్టర్ పందల విరాజిత ఎన్టీఆర్ వైద్య యూనివర్సిటీ టాపర్‌గా నిలిచింది. విద్యార్థిని కృషి, పట్టుదల జనరల్ మెడిసిన్ అధ్యాపకుల మార్గదర్శనంతో గోల్డ్ మెడల్ సాధించినట్లు అడషనల్ డీఎంఈ రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ తెలిపారు. గవర్నమెంట్ మెడికల్ కాలేజీ విద్యార్థులు ఈ స్ఫూర్తితో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సదర్భంగా డాక్టర్ విరాజిత మాట్లాడుతూ ఎండోక్రైనాలజీ సూపర్‌స్పెషాలిటీ చేసి రోగులకు సేవ చేయాలని అభిలషిస్తున్నట్లు తెలిపారు. అకాడమిక్ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ విజయ భాస్కర్‌రెడ్డి, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కేబీ యాదవేంద్రరెడ్డి, సహాయ ఆచార్యులు డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ లీలా ప్రసాద్‌బాబు, డాక్టర్ విజయసింహారెడ్డి, డాక్టర్ అర్జున్ అవ్వారు, డాక్టర్ మనోహర్‌లు డాక్టర్ విరాజితకు అభినందనలు తెలిపారు.

రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలి

కడప సెవెన్ రోడ్స్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రైతాంగ, కార్మిక వ్యతిరేక విధానాలు మాను కోవాలని వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. కడప రెవెన్యూ డివిజన్ ఆఫీస్ వద్ద బుధవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, ఏఐటీయూసీ, సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శులురైతు సంఘాల జిల్లా కార్యదర్శులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాల్గొని మాట్లాడారు. ఇప్పటికైనా ఈ కేంద్ర ప్రభుత్వం రైతాంగ కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని, లేకుంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పుట్టగొడుగుల పెంపకం.. లాభదాయకం

● కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ కార్యక్రమాలు
● వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు కృషి

సికెదిన్నె, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పుట్టగొడుగుల పెంపకం లాభదాయకంగా ఉంటుంది. మన పని మనం చేసుకుంటూ తక్కువ ఖర్చుతో తీరిక సమయాల్లో ఇంటిలో కూర్చొని సంపాదించుకునే కుటీర పరిశ్రమగా పుట్టగొడుగుల పెంపకాన్ని చేపట్టవచ్చు. దీనిపై ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రంలో నిరుద్యోగ యువతకు, మహిళలకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి.. వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నారు.

పుట్టగొడుగులు... రకాలు

పుట్టగొడుగుల్లో దాదాపు రెండు వేలకుపైగా రకాలు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే మన దేశంలో ప్రధానంగా నాలుగు రకాల పుట్టగొడుగులను ఎక్కువగా పెంచుతుంటారు. అందులో వైట్ బటన్ మష్రూమ్, ముత్యపు చిప్ప పుట్టగొడుగులు, వరిగడ్డి పుట్టగొడుగులు, పాల పుట్టగొడుగులు ప్రధానమైనవి. ఇందులో మన ప్రాంతంలో ఎక్కువగా పాలపుట్టగొడుగులు, ముత్యపు చిప్ప పుట్టగొడుగులు ఎక్కువగా లభిస్తున్నట్లు, వాటికి గిరాకీ ఉన్నట్లు తెలుస్తోంది.

పుట్టగొడుగుల్లో ఔషధ గుణాలు

పుట్టగొడుగుల్లో అనేక రకాల ఔషదగుణాలు ఉన్నాయి. పుట్టగొడుగులు యాంటీబయాటిక్, యాంటీ క్యాన్సర్, హైపోలిపిడిమిక్, యాంటీహైపర్‌టెన్సన్ లాంటి జబ్బులకు ఔషధాలుగా ఉపయోగపడతాయి. పుట్టగొడుగుల్లో వరి, గోధుమ, కూరగాయల కంటే అధికంగా ప్రొటీన్స్ ఉంటాయి. పీచుపదార్థం ఉంటుంది. పుట్టగొడుగుల్లో కొవ్వు పదార్థాలు ఉండవు. అందరికి ఎంతగానో అనుకూలంగా ఉంటుంది. పొటాషియం, సోడియం, పాస్ఫరస్‌లు ఎక్కువగా ఉంటాయి. విటమిన్-సి, విటమిన్-బి అధికంగా ఉంటాయి. పిండి పదార్థాలు తక్కువగా ఉండటం వలన షుగర్ వ్యాధి, గుండెజబ్బులున్న వారికి ఇవి మంచి ఆహారంగా ఉపయోగపడుతాయి.

కుటీర పరిశ్రమగా....

పుట్టగొడుగుల పెంపకంను కుటీర పరిశ్రమగా ఏర్పాటు చేయడం వలన ఎక్కువ పెట్టుబడి అవసరం లేదు. కాలవ్యవధి తక్కువగా ఉంటుంది. 35 నుంచి 45 రోజుల్లో పెంచవచ్చు. ఇంటి ఆవరణలో వీటిని సులభంగా పెంచుకోవచ్చు. అధిక దిగుబడులు, ఆదాయాన్ని పొందవచ్చు. పంట అయిపోయిన తర్వాత దిండ్లను ఎరువుగా కూడా ఉపయోగించుకునే వీలుంటుంది.



శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



పుట్టగొడుగుల పెంపకంపై యువత, మహిళలకు శిక్షణ కార్యక్రమం ఇస్తున్నాం. ఈ అవకాశాన్ని గ్రామీణ యువత, మహిళలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ శిక్షణను ఉపాధి అవకాశాలుగా మార్చుకునేందుకు ఉపయోగపడుతుంది. ప్రతిసంవత్సరం యువతకు వివిధ రకాల శిక్షణ కార్యక్రమాలు అందిస్తుంటాము. కొందరు సొంతంగా యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు.

- డాక్టర్‌వీరయ్య, కేవీకే సమన్వయకర్త

పుట్టగొడుగుల పెంపకంతో ఉపాధి



పుట్టగొడుగుల పెంపకాన్ని యువత కుటీర పరిశ్రమలా ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందవచ్చు. పుట్టగొడుగుల్లో ఎన్నో పోషక విలువలు ఉన్నాయి. ప్రస్తుతం వీటి వాడకం పెరిగింది. పుట్టగొడుగులతో కూర, తాలింపు, బిర్యానీ, పుట్టగొడుగుల చాట్, పుట్టగొడుగుల కర్రి తదితర రకాలుగా ఉపయోగించి పిల్లలకు, పెద్దలకు ఇష్టమైన విధంగా తయారు చేసుకోవచ్చు.

- శిల్పకళ, కేవీకే శాస్త్రవేత్త

25 ఫారం పాండ్లు నిర్మించాలి

● ఉపాధి పథకం సమీక్షలో డ్వామా పీడీ వెంకటరత్నం



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ వెంకటరత్నం

కలికిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రతి పంచాయతీలోనూ 25 ఫారం పాండ్లు నిర్మించాలని డ్వామా పీడీ వెంకటరత్నం స్పష్టం చేశారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థకు చెందిన ఆరు మండలాల్లోని ఉపాధి హామీ సిబ్బంది, ఉద్యోగులతో కలికిరిలో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ రాబోయే ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన పనుల జాబితాలో ప్రతి పంచాయతీకి 25 వంతున ఫారం పాండ్లు మంజూరు చేసి సిద్ధంగా వుంచినట్లు ఆయన గుర్తు చేశారు. ఎక్కడైనా తేడా వుంటే కొత్తవి మంజూరు చేయించుకుని లక్ష్యం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి క్షేత్ర సహాయకుడు (ఫీల్డ్ అసిస్టెంటు) తన పంచాయతీలో ఫారం పాండ్ల నిర్మాణానికి కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఇందులో ఎవరికీ మినహాయింపు వుండదన్నారు. ప్రతి పంచాయతీలోనూ ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల్లో 75 శాతం మంది ఫారం పాండ్ల పనుల్లో జనరేట్ కావాలని స్పష్టం చేశారు. ఈ ఏడాది కూలీల లక్ష్యాన్ని సోమవారంలోగా పూర్తి చేసుకోవాలన్నారు. నిమ్మనపల్లె మండలంలో కూలీల సంఖ్యకు డిమాండుకు భారీ వ్యత్యాసం వున్న విషయాన్ని ప్రస్తావిస్తూ ఆగ్రహించారు. ప్రతి ఉద్యోగి మార్చి చివరి నాటికి లేబర్ బడ్జెట్ లక్ష్యాలను పూర్తి చేసుకోవాలన్నారు. ఇక ఆరు మండలాల్లో మొదలు పెట్టిన ఇంకుడు గుంతల పనులను నెలాఖరుకు పూర్తి చేయాలని పీడీ సూచించారు. వచ్చే ఏడాదికి ఉద్యాన పంటలు వేసే రైతులను గుర్తించి సమాయత్తం చేయాలని, కొత్త పనులను గుర్తించి మంజూరు కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. కలికిరి క్లస్టర్ ఏపీడీ శ్రీనివాసులు, కలికిరి, పీలేరు, కలకడ, వాల్మీకిపురం, కేవీపల్లె, నిమ్మనపల్లె మండలాలకు చెందిన ఏపీవోలు, జూనియర్ ఇంజనీర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సీఎల్ఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.



మదనపల్లె మండలం, కోళ్లబైలు గ్రామం బయ్యారెడ్డి కాలనీలో రోడ్డుపైకి మురుగు నీరు చేరుకుంది. వాహనదారులకు, ప్రజలకు వెళ్లడానికి ఇబ్బందిగా ఉంది. నెలలు గడుస్తున్నా ఈ సమస్యను అధికారులు పట్టించుకోవడంలేదు. అంటురోగాలు వస్తే గానీ పట్టించుకోరా అని జనం అగ్రహిస్తున్నారు.
ఈసమస్యపై ఉన్నతాధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.
- మదనపల్లె అర్బన్ (ఆంధ్రజ్యోతి)

సెక్యూరిటీ గార్డును తొలగించాలి



ప్రభుత్వ ఆస్పత్రి ముందు ఆందోళన చేస్తున్న దృశ్యం

పీలేరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి డ్యూటీకి వస్తున్న ప్రభుత్వ ఆస్పత్రి సెక్యూరిటీ గార్డుపై చర్యలు తీసుకోవాలని డీబీఎస్ఎఫ్ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బద్దె భానుప్రకాశ్ డిమాండ్ చేశారు. సెక్యూరిటీ గార్డుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు ఎన్ఎస్‌యూఐ, ఏబీఎంఎస్ జేఏసీ, మాలమహానాడు విద్యార్థి సంఘం, బహుజన విద్యార్థి సమాఖ్య మద్దతు తెలిపాయి. భానుప్రకాశ్, గుర్రం నారాయణ, మద్దెల అమృతతేజ, మాలతోటి నరేశ్ మాట్లాడుతూ మద్యం తాగి విధులకు హాజరైన సెక్యూరిటీ గార్డుకు వైద్యులు వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజల ఆరోగ్యానికి, భద్రతకు బాధ్యుడిగా ఉండాల్సిన సెక్యూరిటీ గార్డు, అతని విధులను పర్యవేక్షించాల్సిన వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. అతనిపై చర్యలు తీసుకోకుంటే భవిష్యత్తులో మరిన్ని ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సాయిసంపత్ కుమార్, ఏబీఎంఎస్ జేఏసీ నేతలు రామాంజులు, వెంకటరమణ, రమేశ్, లోకవర్ధన్, రామచంద్ర, డీబీఎస్ఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు మద్దెల వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపడతాం

పెద్దతిప్పసముద్రం మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదుపై రికార్డులను పరిశీలించి విచారణ చేపడతామని మదనపల్లె డివిజనల్ పంచాయతీ అధికారి నాగరాజు వెల్లడించారు. ఇటీవల ఉమ్మడి బూర్లపల్లె పంచాయతీ నుంచి కొత్తగా ఏర్పడిన పోతుపేట అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులు, పంచాయతీలో చేపట్టిన పనుల వివరాలు కావాలని పోతుపేట వాసి కేవీ రమణ ఆర్‌టీఐ ద్వారా కోరాడు. దీంతో పంచాయతీ అధికారులు తమ వద్ద ఉన్న సమాచారాన్ని అందించారు. సంతృప్తి చెందని రమణ గ్రామంలో నిధులు దుర్వినియోగమయ్యాయని, పంచాయతీ రికార్డులను తనిఖీ చేపట్టి దుర్వినియోగమైన నిధులను రికవరీ చేయాలని కోరాడు. దీంతో బుధవారం డీఎల్‌పీఓ, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ మునిప్రతాప్‌తో కలిసి బూర్లపల్లె సచివాలయయంలో పలు రికార్డులను పరిశీలించి పంచాయతీ అభివృద్ధి పనులపై విచారణ చేపట్టి నివేదికను సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. నిధులు దుర్వినియోగమైనట్లు తేలితే శాఖపర చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీఓ అన్నారు.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి : సీపీఐ



సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

మదనపల్లె టౌన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించి, సకాలంలో కూలి సొమ్ము చెల్లించాలని సీపీఐ అనుబంధ విభాగం బీకేఎంయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్ప డిమాండ్ చేశారు. స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట సీపీఐ నేతలు చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం గ్రామాల్లో వ్యవసాయ పనులు తక్కువగా వున్నాయని, దీని వలన ఉపాధి లేక కూలీలు వలస వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారన్నారు. వ్యవసాయ కూలీలు జీవనానికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. కూలీలను ఏడాదికి 200 రోజులు పనిదినాలు కల్పించి, కూలి మొత్తం రోజుకు రూ.700కు పెంచాలన్నారు. ఇప్పటి వరకు చేసిన పనులకు రెండు నెలలుగా కూలీలకు చెల్లింపులు లేవని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు ముబారక్, తిరుమల, చంద్రశేఖర్, కాటయ్య, బాలు, కుమారి, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

ఎన్ఎంయూ వ్యవస్థాపకుడికి ఘన నివాళి

మదనపల్లె అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ఎన్ఎంయూ వ్యవస్థాపక అధ్యక్షుడు, రాజరత్నం అవార్డు గ్రహీత పి. రామమూర్తి 20వ వర్ధంతిని నిర్వహించారు. ఎన్ఎంయూ నేతలు ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. సీసీఎస్ బోర్డు మెంబరు వినోద్‌బాబు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులకు ఎన్ఎంయూను ఏర్పాటు చేసి ఆయన ఎనలేని కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మదనపల్లె వన్ అండ్ టూ డిపో కార్మికులు, ఎన్ఎంయూ వన్ డిపో అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డిబాషా, పి. రమణ, జీఎస్‌వాసులు, రాధ, బావజాన్, గ్యారేజ్ సుధా పాల్గొన్నారు.

ఘనంగా రామ్మోహన్ రావు వర్ధంతి



రామ్మోహన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

పీలేరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మజ్దూర్ యూనియన్ వ్యవస్థాపకులు, దివంగత పి.రామ్మోహన్ వర్ధంతిని ఆ సంఘ శ్రేణులు పీలేరులో నిర్వహించారు. పీలేరు డిపో కార్యాలయం వద్ద ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించి ఎన్ఎంయూ ద్వారా ఆయన సాధించిన విజయాలను స్మరించుకున్నారు. అనంతరం ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఎన్ఎంయూఏ నేతలు ఆదినారాయణ, ఎల్లయ్య, కేకే నాయుడు, బీఆర్‌బీ నాయక్, ఎంహెచ్ నాయుడు, రామయ్య, ఈశ్వరయ్య, పీసీఎస్ రెడ్డి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ ధర్నా

ములకలచెరువు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నేతలు ధర్నా నిర్వహించారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సీపీఐ మండల కార్యదర్శి అంజనప్ప, ఏఐటీయూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సలీంబాషా మాట్లాడుతూ మండలంలో నెలకొన్న తాగునీటి సమస్యలు పరిష్కరించాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులను పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ హరినారాయణకు అందజేశారు. మల్లికార్జున, భాస్కర, ఉత్తన్న, సుబ్బన్న, జయరాం తదితరులు పాల్గొన్నారు.

వెలుగు హోమ్ స్టోర్స్‌తో ఆర్థికాభివృద్ధి

పెద్దమండ్యం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): వెలుగు సంఘాలు ఆధ్వర్యంలో వెలుగు హోమ్ స్టోర్స్ నిర్వహణతో సంఘాలు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఏరియా కోఆర్డినేటర్ గంగాధర పేర్కొన్నారు. పెద్దమండ్యం స్త్రీశక్తి భవన్‌లో మహిళలతో ఈజీఐ మార్ట్ ప్రతినిధులతో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈజీ మార్ట్ సహకారంతో వెలుగు హోమ్ మార్ట్ వ్యాపారాలతో వారు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. ఏపీఎం నరసింహులు, జిల్లా డీపీఎంయూ రమేష్, ఈజీ మార్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు

ఘనంగా బాట గంగమ్మ పగలు తిరునాళ్లు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మదనపల్లె అర్బన్, మార్చి5(ఆంధ్రజ్యోతి): స్థానిక పట్టణం, బుగ్గవంక కాల్వ సమీపంలో వెలిసిన బాట గంగమ్మ పగలు తిరునాళ్లు ఆలయ ధర్మకర్త, మాజీ కౌన్సిలర్, బొగ్గిటి అలివేలమ్మ, అల్లుడు శీనా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ ఆవరణలో ఉత్సవ విగ్రహానికి విశేషంగా పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి మొక్కులు తీర్చుకుని వందల మంది భక్తులకు మాంసాహార భోజనం ఏర్పాటు చేశారు. మహిళలకు పసుపు, కుంకుమ ఆలయ ధర్మకర్త అందించారు. అనంతరం వాల్మీకి సంఘం నేతలు ధర్మకర్తను సన్మానించారు. వీఆర్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పొదల నరసింహులు, వాల్మీకి సంఘం నేతలు బొగ్గిటి కృష్ణమూర్తి, ముత్తురాశి హరికృష్ణ, తెట్టు చిన్నరెడ్డెన్న, నల్లబోతులు సుదర్శనబాబు, నాగినేని గోవిందు, బుర్ర లక్ష్మీపతి, తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనపు నిధులు

కలికిరి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పక్కా గృహాలు మంజూరై ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేసుకోలేని బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనంగా నిధులు మంజూరు చేయనున్నట్లు కలికిరి గృహ నిర్మాణ శాఖ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంజూరైన ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించి పునాదులు, గోడలు పూర్తి చేసి ఆ పైన ఆర్థిక స్థోమత లేక నిర్మాణాలను ఆపేసిన లబ్ధిదారులకు ఆర్థికంగా చేయూత ఇవ్వనున్నట్లు ఆయన చెప్పారు. ప్రస్తుతం ఇస్తున్న రూ.1.80 లక్షలు కాకుండా బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ.50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.70 వేలు అదనంగా అందజేస్తామన్నారు. లబ్ధిదారులు కుల ధృవీకరణ పత్రాలను హౌసింగ్ ఏఈ కార్యాలయంలోగానీ లేదా స్థానిక సచివాలయాల్లోని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు రెండు రోజుల్లోగా అందజేయాలని కోరారు. పూర్తి కాని ఇళ్ళకు అవసరమైన సిమెంటు, ఇనుప కమ్మీ కావలసిన మేరకు గోదాములో సిద్ధంగా వుంచినట్లు చంద్రశేఖర్ రెడ్డి వివరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని నిర్ణీత గడువులోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు.

తొలి కోత మామిడి ధరలు అదుర్స్

బేనీషా మామిడి కిలో రూ.120



పెద్దమండ్యం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తొలికోత మామిడి పండ్లు మార్కెట్‌లోకి వచ్చేశాయి. అన్నమయ్య జిల్లా గాలివీడు వారపు సంతలో తొలి కోత బేనిషా మామిడి పండ్లు ధరలు అదిరాయి. బేనీషా మామిడి కిలో రూ. 120 పలికాయి. మాములుగా అయితే గ్రామీణ ప్రాంతంలో ప్రారంభం రోజుల్లో బేనిషా మామిడి రూ 40 నుంచి రూ. 50 లోపు వుండేవి. తొలి రుచుల కోసం జనం ఎగబడడంతో గంట వ్యవవధిలోనే కిలో రూ. 120తో భారీగా అమ్ముడు పోయాయి. ఈ మామిడి కోస్తా నుంచి దిగుమతులు చేసుకున్నట్లు వ్యాపారులు తెలిపారు. రాయలసీమ ప్రాంతంలో ఈ ఏడాది మామిడి అధిక దిగబడులు వచ్చే అవకాశం ఉందని ప్రజలు చెపుతున్నారు.

పక్కాగృహాల నిర్మాణాలు పరిశీలన

పెద్దమండ్యం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పెద్దమండ్యం లేఅవుట్‌లో జరుగుతున్న పక్కాగృహాల నిర్మాణాలను పెద్దమండ్యెం తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్ బుధవారం పరిశీలించారు. గతంలో పెద్దమండ్యం సమీపంలోని లే ఔట్-2 సిద్దంగా వున్నా 80 మంది లబ్ధిదారుల ఎంపిక జరగాల్సి ఉందని రెవెన్యూ సిబ్బంది తెలిపారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని లే ఔట్‌లలో పక్కాగృహాల స్థితిగతుల నివేదిక సిద్ధం చేయాలన్నారు. మండల సర్వేయర్ హసీన్‌తాజ్, ఆర్ఐ సయ్యద్ ఇమ్రాన్, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధవహించాలి




వర్మీకంపోస్టుపై సూచనలిస్తున్న డీపీఓ మస్తాన్‌వలి

కలకడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధవహించాలని డీపీఓ మస్తాన్‌వలి సిబ్బందిని ఆదేశించారు. జిల్లాలోని మండల కేంద్రాల కార్యదర్శులకు నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర శిక్షణ కార్యక్రమాన్ని తనిఖీ చేసిన డీపీఓ మాట్లాడుతూ అన్ని పంచాయతీల్లో ప్రతి ఇంటి నుంచి చెత్తసేకరించి చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించాలని సూచించారు. నిరుపయోగకరంగా ఉన్న కేంద్రాలను అందుబాటులోకి తేవాలన్నారు. అనంతరం వర్మీకంపోస్టు తయారీని పరిశీలించి తగు సూచనలు చేశారు. ఎంపీడీఓ అబ్దుల్ రహీం, ఈఓఆర్డీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సౌకర్యాలు కల్పించాలి

కలకడ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో కనీస వసతులు కల్పించాలని సంఘ నేతలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ ఫణికుమార్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ సమావేశంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానటరింగ్ సభ్యులు పాలకుంట శ్రీనివాస్ మాట్లాడుతూ కలకడ ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వ అవసరాలకు కేటాయించిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. శ్మశానవాటికల స్థలాలను సర్వే చేయించి హద్దులు చూపాలన్నారు. ఎంపీడీఓ అబ్దుల్ రహీం, దళిత నేతలు నరసింహులు, దామోదర్, రెడ్డికిరణ్, జివిరమణ, రజనీ, శ్రీనివాసులు, మల్లికార్జున పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో ఆగని మట్టి అక్రమ తరలింపు




డేగాని చెరువు నుంచి తరలుతున్న మట్టి

బి.కొత్తకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టి అక్రమ తరలింపు మూడుపువ్వులు ఆరుకాయలుగా నడుస్తోంది. అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చూసీ చూడనట్లు సహకరిస్తుండడంతో మట్టిమాఫియా యదేచ్ఛగా ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటల నుంచి మట్టిని తరలిస్తూ వ్యాపారం చేసుకుంటూ డబ్బు కొల్లగొడుతోందన్నారు. పట్టణానికి ఆనుకుని వున్న చెరువులోనే ఎక్స్‌కవేటర్‌తో ట్రాక్టర్ల ద్వారా తరలింపు అప్రతిహతంగా సాగుతోంది.

'తక్కువ చేసి మాట్లాడే హక్కు నీకు లేదు'

మదనపల్లె అర్బన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ స్థాయిని దిగజార్చి మాట్లాడే హక్కు నీకు లేదని మాజీ సీఎం జగన్‌కు జనసేన నేత షై ఫోర్సు మహేష్ హితవు పలికారు. మీడియాతో ఆయన మాట్లాడుతూ పవన్ కల్యాణ్‌ను కార్పొరేట్‌కు ఎక్కువ ఎమ్మెల్యేకు తక్కువ అని జగన్ మాట్లాడడం చేతగాని తనం అవుతుందని ఆరోపించారు. నీ ఫ్యాక్షన్ బుద్దులు, నీచ రాజకీయంతో ఇప్పటికే నీవు అనుకుంటున్న స్థాయికి దిగజారిపోయావని దీనికి నిదర్శనం ప్రజలు ఇచ్చిన తీర్పే అన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ప్రత్యేక అలంకరణలో నరసింహస్వామి

గుర్రంకొండ, మార్చి 5(ఆంధ్రజ్యోతి): తరిగొండ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారికి బుధవారం టీటీడీ వేదపండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. వేకువనే ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. పది రోజులు బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా సాగాలని ప్రత్యేక పూజలను చేశారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు...

గురువారం ఉదయం మీనలగ్నంలో స్వామి వారికి ధ్వజారోహణ, సాయంకాలం ఊంజల్ సేవ, హంసవాహనంపై స్వామి వారు ఊరేగనున్నారు.

పదోన్నతి ఆపై బదిలీ

పెద్దతిప్పసముద్రం మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ రమణకు సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ చిత్తూరు జిల్లా బంగారుపాళ్యెంకు బదిలీ చేసినట్లు ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా రామచంద్ర పని చేస్తున్నారు. పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ కార్యాలయంలో ఏటగా ఇటీవల జ్యోతి బాధ్యతలు స్వీకరించారు. ఆమె వెంటనే ఒక్కరోజులోనే డిప్యూటేషన్‌పై వెళ్లారు. ఇక్కడికి ఎవరు వచ్చినా బాధ్యతలు స్వీకరించడం వెంటనే వెళ్లిపోతుండడంతో ఇక్కడ పాలన అస్తవ్యస్తంగా మారిందని ప్రజలు వాపోతున్నారు. కార్యాలయానికి కావాల్సినంత సిబ్బంది లేకపోవడంతో అభివృద్ధి కుంటుబడుతోందన్నారు. వైసీపీ పాలనలో ఉన్న అధికారులే ఇక్కడ ఉన్నారని కార్యాలయానికి కావాల్సినంత సిబ్బందిని కూటమి ప్రభుత్వం నియమిస్తే అభివృద్ధి ముందుకు సాగుతుందని కనీసం ఇప్పటికైనా సంబంధిత అధికారులు పెద్దతిప్పసముద్రం మండల పరిషత్ కార్యాలయానికి సిబ్బందిని నియమించి మండల అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారు.

మంటలు అదుపులోకి...



మంటలను ఆర్పివేస్తున్న సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తంబళ్లపల్లె, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మల్లయ్యకొండకు వెళ్లే దారిలో ఉన్న డంపింగ్ యార్డులో చెలరేగిన మంటలను బుధవారం పంచాయతీ సిబ్బంది ఆర్పివేశారు. రెండు రోజుల కిందట డంపింగ్ యార్డులోని చెత్తకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో చెత్త, వ్యర్థాల నుంచి వచ్చే పొగతో రైతులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన అధికారులు ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి ఆదేశాలతో కార్యదర్శి రామకృష్ణ బుధవారం ఉదయం డంపింగ్ మంటలను వాటర్ ట్యాంకు పెట్టి ఆర్పివేశారు.

ప్రత్యేక ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలి

పీలేరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి):ప్రత్యేక ప్రతిభావంతులు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణమాదిగ అన్నారు. పీలేరులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడతామన్నారు. నాయకులు వెంకటరమణ, భాస్కర్, అమరనాథ్, కిరణ్‌కుమార్, రాము తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

రేషన్ బియ్యాన్ని తూకం వేసి డీలర్లకు ఇవ్వాలి ● త్వరలో ప్రభుత్వ పాఠశాలలకు సన్నబియ్యం

మెనూ పాటించని గురుకుల ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసు ● రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మెన్ విజయప్రతాప్‌రెడ్డి



కురబలకోటలో కేజీబీవీ విద్యార్థులతో మాట్లాడుతున్న విజయప్రతాప్‌రెడ్డి

తంబళ్లపల్లె, మార్చి 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మెన్ విజయ ప్రతాప్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం వివిధ ప్రాంతాల పర్యటనలో భాగంగా ఆయన మదనపల్లె, కరబలకోట, తంబళ్లపల్లెల్లో పర్యటించారు. తంబళ్లపల్లె మండలం కుక్కరాజుపల్లె 17వ రేషన్‌దుకాణం, అంగన్వాడీ కేంద్రం, సివిల్ సప్లయ్స్ ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్, గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కేజీబీవీలను తనిఖీచేశారు. అనంతరం ఎంఎల్ఎస్ స్టాకు పాయింట్‌లో రేషన్ బియ్యం, సరుకుల స్టాకు, నాణ్యత, రికార్డులను పరిశీలించారు. రేషన్ బియ్యం డీలర్లకు ఇచ్చే ముందు వారి సమక్షంలోనే తూకం వేసి ఇవ్వాలని గోడౌన్ డీటీ వెంకట్రమణారెడ్డిని ఆదేశించారు. అనంతరం బాలుర గురుకుల పాఠశాల, కేజీబీవీలను తనిఖీ చేసి బియ్యం, పప్పులు, గుడ్లు, కూరగాయలు, ఇతర వస్తువుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందించే ఆహారంలో నిర్దేశించిన ప్రమాణాలు పాటించాలని అదేశించారు. త్వరలో ప్రభుత్వ పాఠశాలలకు సన్నబియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసు

తంబళ్లపల్లె గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు మెనూ సరిగ్గా ఇవ్వని కారణంగా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రంగనాయకులకు షోకాజ్ నోటీసు ఇవ్వాలని జిల్లా వెల్ఫేర్ అధికారిని ఆదేశించారు. గురుకులం తనిఖీలో చికెన్ ఎంత పరిమాణంలో వడ్డిస్తున్నారు.? వారంలో ఎన్ని గుడ్లు ఇస్తున్నారు.? అని ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. ఒక్కో విద్యార్థికి 100 గ్రాముల చొప్పున వారంలో రెండు సార్లు చికెన్ వడ్డిస్తున్నామని, నాలుగు కోడిగుడ్లు ఇస్తున్నామని ప్రిన్సిపాల్ బదులివ్వడంతో ప్రిన్సిపాల్‌పై ఆయన ఆగ్రహించారు. ప్రతి విద్యార్థికీ వారానికి 350గ్రా(ఒక్కోసారి 157.50 గ్రా) చికెన్, ఆరు కోడిగుడ్లు ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థులతో సమావేశమై మెనూపై ఆరా తీశారు. మెనూ పాటించని ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వాలని జిల్లా వెల్ఫేర్ సూపరింటెండెంట్ సురేష్‌ను ఫోన్‌లో ఆదేశించారు. ఆయన వెంట డీఎస్వో రఘురాం, తహసీల్దారు హరికుమార్, సీడీపీఓ నాగవేణి, ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు, మండల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఎండీయూ వ్యవస్థను రద్దు చేయండి

మదనపల్లె, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మొబైల్ డిస్పెన్సరీ యూనిట్(ఎండీయూ)లను రద్దు చేయాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ్ ప్రతాప్‌రెడ్డిని రేషన్ డీలర్లు కోరారు. మదనపల్లెకు విచ్చేసిన చైర్మన్‌ను కలసి వినతి పత్రం అందజేశారు. పాత పద్దతిలోనే కార్డుదారులకు నిత్యావసరాలు అందజేయాలని కోరారు. బి.గోపాల్‌రెడ్డి, వై.అంజనప్ప, కె.కళాధర్, రఘునాథ్, ఎస్.ఖాసీం, జె.మురళి, ప్రభాకర్, సుధీర్ పాల్గొన్నారు.

ముదివేడు కేజీబీవీలో...

కురబలకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మట్లివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రం, ముదివేడు కేజీబీవీ, మోడల్ స్కూల్, జడ్పీ హైస్కూల్‌లో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. వంటగదిని పరిశీలించి స్టాకు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు విద్యతో పాటుగా మంచి ఆహారం ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థికి టెన్త్ కీలకమని, పరీక్షలను సవాల్‌గా తీసుకుని మంచి ఫలితాలను సాధించాలన్నారు. డీఈఓ సుబ్రమణ్యం, తహసీల్దార్ తపస్విని, ఆర్ఐ బాల సుబ్రమణ్యం, ఎంఈఓ ద్వారకనాథ్, ఎస్ఓ పర్వీన్‌భాను, తదితరులు పాల్గొన్నారు.